ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 25 ఆగస్టు 2024




వడ్లమూడి సమీపంలోని డీవీసీ ఆస్పత్రి ఐసీయూలోని వసతులను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు, ఇతర డాక్టర్లు, సిబ్బంది

6లో..

విద్యాలయంలో.. విషవాయువులు

- సైన్స్ ప్రయోగంలో అపశృతి.. విద్యార్థులకు అస్వస్థత
- సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో ఘటన.. సీఎం పేషీ ఆరా
- సత్వరం స్పందించిన అధికారులు.. నిలకడగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి


బాపట్ల ఏరియావైద్యశాలలో చికిత్స పొందుతున్న సూర్యలంక కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు


చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న జాయింట్ కలెక్టర్.బి.సుబ్బారావు


ఆసుపత్రిలో కోలాహలంగా ఉన్న పేరెంట్స్


విషవాయువులు వెలువడటానికి కారణమైన రసాయనాలతో ఉన్న పేపర్‌ను భద్రపరిచి ల్యాబ్ పంపేందుకు సిద్ధం చేసిన వైద్యులు

బాపట్ల, ఆగస్టు 24: సైన్సు ప్రయోగం.. కొందరు విద్యార్థుల ఆకతాయితనం.. విషవాయువులు వెలువడి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన బాపట్ల మండలం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం చోటుచేసుకుంది. విద్యాలయంలో ఉదయం ఆరో తరగతి విద్యార్థులకు సైన్స్ క్లాస్‌లో భాగంగా రసాయన ప్రయోగాలను ప్రాక్టికల్స్ ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయురాలు వివరించారు. టీచర్ బయటకు వెళ్లగా అక్కడ ఉన్న రసాయనాలకు ఓ విద్యార్థి తన దగ్గర ఉన్న ఉప్పు, శానిటైజర్‌కు తోడు కాఫీపొడి మిక్స్ చేశాడు. దీంతో ఒక్కసారిగా విషవాయువులు తరగతి గది అంతా పొగలా వ్యాపించాయి. ఇవి పక్క గదిలోని ఏడో తరగతి విద్యార్థులను కూడా తాకడంతో అస్వస్థతకు గురయ్యారు. కొంతమంది విద్యార్థులు టిష్యూ పేపర్‌పై ఆ రసాయనాన్ని వేసి వాసన చూడడంతో మరింత అస్వస్థతకు గురయ్యారు. ముగ్గురు విద్యార్థులు గదిలోనే స్పృహ తప్పి పడిపోగా, మిగిలిన వారు ఊపిరి అందక ఇబ్బంది పడ్డారు. పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయులు సూర్యలంకలోని ఆస్పత్రికి 25 మందిని తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాపట్లలోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ ఆధ్వర్యంలో వైద్యబృందం తక్షణమే స్పందించి విద్యార్థులకు చికిత్స అందించడంతో మూడు గంటలు తర్వాత కోలుకున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో కుటుంబ సభ్యులు వచ్చి పిల్లలను తీసుకెళ్లారు. విద్యార్థులలో మధురియా అనే బాలిక జ్వరంతో బాధపడుతూనే స్కూల్‌కు వెళ్ళి విషవాయువుల బారినపడటంతో చికిత్స పొందుతోంది. షణ్ముఖ అనే మరో విద్యార్థికి ఈసీజీ తీయగా ఇతర సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

విద్యార్థులను పరామర్శించిన జేసీ

సంఘటన గురించి తెలుసు కున్న వెంటనే జేసీ బి.సుబ్బారావు ఏరియావైద్యశాలకు వచ్చి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరో గ్య పరిస్థితిపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఏమిలేదని అందరు ఆరోగ్యంగా ఉన్నట్లు జేసీ విలేకర్లకు తెలిపారు. విద్యాలయంలో విషవాయువులు వెలువడటానికి కారణమైన టి ష్యూ పేపర్లలోని రసాయనాలను సేకరించి ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపించి పరీక్షిస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. 25 మం ది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని చెప్పారు. ఈ సంఘటనపై సీఎం పేషీ జిల్లా అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అన్ని రకాల చర్యలు తీసుకుని విద్యార్థులకు చికిత్సలు అందించాలని అధికారులను సీఎం కార్యాలయం ఆదేశించింది.

వైద్యాధికారులపై జడ్జి వాణి ఆగ్రహం

విషవాయువులతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి ఏరియావైద్యశాలను సందర్శించారు. ఆసమయంలో వైద్యులు సరైన సమాచారం ఇవ్వకపోవడం, కొంత మంది వైద్యుల నిర్లక్ష్యంపై ఓ మహిళ ఫిర్యాదుతో జడ్జి వాణి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్‌ను పిలిపించి ఉదయం డ్యూటీచార్ట్ గురించి అడిగి తెలుసుకున్నారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని మిస్ గైడ్ చేయరాదని సున్నితంగా హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.


బాపట్ల ఏరియా వైద్యశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

అక్రమ లేఅవుట్లు.. 274

- వాటి వద్ద బోర్డుల ఏర్పాటుకు సిద్ధం
- ప్రజల్లో అవగాహనకు అధికారుల చర్యలు
- కూటమి ప్రభుత్వం రాకతో అక్రమాలపై దృష్టి
- వైసీపీ పాలనలో ఇబ్బడిముబ్బడిగా అనధికార లేఅవుట్లు
- వాటిని కొనుగోలు చేసిన మధ్యతరగతి వర్గాలు విలవిల




బాపట్ల పరిధిలోని పాండురంగాపురం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్

బాపట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ లే అవుట్ల విషయంలో అక్రమార్కులు పోటీ పడ్డారు. వైసీపీ నేతలకు, వారి తొత్తులుగా వ్యవహరించిన అధికార గణానికి ముడుపులిచ్చి ఎటువంటి నిబంధనలు పాటించకుండా లే అవుట్లు వేసి సొంతింటి కలసాకారం కోసం పైసాపైసా కూడబెట్టుకుని ప్లాట్లు కొనుక్కున్న జనాన్ని నిలువునా వంచించారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న అక్రమ లే అవుట్ల వివరాలను యంత్రాంగం సేకరించింది. వాటి వివరాలతో ఇప్పటికే ప్రకటనలు ఇవ్వడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో 39, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 104, రేపల్లె మున్సిపాలిటీ పరిధిలో 40, అద్దంకి, కొరిశపాడు, చీరాల, పర్చూరు, మార్టూరు, వేటపాలెంలో భాగమై ఉన్న ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 91 అనధికార లే అవుట్లను అధికారులు గుర్తించి బహిరంగపరిచారు. నిబంధనలకు విరుద్ధంగా గుర్తించిన లే అవుట్లలో దాదాపు 50 శాతం ఐదేళ్ల వైసీపీ పాలనలో వేసినవే కావడం గమనార్హం. వీటిలో మొత్తం ప్లాట్లు విక్రయించి నిర్మాణాలు కూడా జరిగినవి 30 శాతం వరకు ఉంటే మొత్తం అమ్మకాలు జరిగిన లే అవుట్లు మరో 50 శాతం వరకు ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలోనే కొంతమంది అధికారులు ఈ అనధికార లేఅవుట్ల వద్దకు వెళ్లి బోర్డులు పెడితే వాటిని దౌర్జన్యంగా తొలగించడంతో పాటు వారి మీద దాడికి కూడా ప్రయత్నించిన సందర్భాలు ఉన్నాయి. అన్ని అనుమతులు ఉన్నాయని ప్రజలను మభ్యపెట్టి ప్లాట్లు అమ్ముకుని రియల్టర్లు రూ.కోట్లు దండుకున్నారు. కొనే ముందు వివరాల కోసం కార్యాలయాలకు వచ్చిన వినియోగదారులను సైతం అప్పుడు పనిచేసిన అధికారులు తప్పుదోవ పట్టించారనే విమర్శలు అప్పట్లో వ్యక్తమయ్యాయి

ఐదేళ్లు ఏం చేశారో..

ఇంత పెద్ద సంఖ్యలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి సామాన్యులను మోసం చేస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఐదేళ్ల పాటు ఎందుకు చేష్టలుడిగి ఉండిపోయారో అనేదానికి సమాధానం చెప్పాల్సి ఉంది. అడ్డగోలుగా లేఅవుట్లు వేసి బిల్డింగ్ నిర్మాణాలు చేపడుతుంటే ఏదశలోనూ వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. కంటితుడుపు చర్యగా ఒకట్రెండుసార్లు నోటీసులు ఇచ్చి మమ అనిపించారే తప్పితే కఠిన చర్యలకు ఉపక్రమించకపోవడం వల్లే ప్లాట్లు కొన్న వేల సంఖ్యలో ప్రజలు ఈ రోజు అగచాట్లు పడే పరిస్థితి తలెత్తింది. నిబంధనల ప్రకారం లేఅవుట్‌కు అన్ని అనుమతులు ఉంటేనే విక్రయాలు జరపాలి. లేకపోతే రిజిస్ట్రేషన్ విభాగానికి సమాధానం ఇవ్వాలి. తదుపరి సదరు యజమానికి నోటీసులు జారీ చేయాలి. అప్పటికీ స్పందించకపోతే దానిని పూర్తిగా రద్దు చేసి బహిరంగ ప్రకటన ఇవ్వాలి. అధికారం అండతో వైసీపీ నేతలు ఏకంగా యంత్రాంగం విధులకే ఆటంకం కల్పించిన వారిపై ఎందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయలేదు? వీటన్నింటికి గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

అక్రమార్కులకు సొమ్ములు.. కొనుగోలుదారులపై భారం

అక్రమ లే అవుట్ల విషయంలో వాటి యజమానులు భారీగానే సొమ్ము చేసుకున్నారు. వారికి వంతపాడిన అధికారగణం వేరే చోటకు బదిలీపై వెళ్లిపోయారు. ఇప్పుడు చిక్కల్లా వాటిని కొన్న జనానికే అన్నట్లు పరిస్థితి తయారైంది. అక్రమ లే అవుట్ల విషయంలో కూటమి ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. దానిలో భాగంగానే చర్యలు తీసుకుంటుంది. రేపోమాపో ఈ అక్రమ లే అవుట్లపై ఒక పాలసీని తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. ఎల్ఆర్ఎస్ కింద నిర్థిష్ట మొత్తాన్ని చెల్లించి వాటిని అనధికార జాబితా నుంచి తప్పించే వెసులుబాటు కల్పించే అవకాశం ఉంది. అలాంటప్పుడు ఇప్పటికే వందశాతం ప్లాట్లు అమ్ముకున్న యజమానులు ఈ శ్రీముఖాలపై స్పందించే అవకాశాలు తక్కువే. అప్పుడు ఈ భారం కూడా ప్లాట్ కొనుక్కున్న వినియోగదారుడిపైనే పడే అవకాశం ఉంది. అక్రమ లే అవుట్లపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టడాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. ఇదే సమయంలో పాలకులు తీసుకునే తదుపరి చర్యలు అటు యజమానులను, ఇటు వారికి సహకరించిన అధికారులపై ఉండాలే తప్పితే జరిమానాల భారం ప్లాట్లు కొనుక్కున్న ప్రజలపై పడకుండా చూడాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వైసీపీ నేతల అండతో చెలరేగిపోయిన లే అవుట్ల యజమానులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు వారికి సహకరించి వేర్వేరు చోట్ల ఉన్న అధికారులపైన విచారణకు ఆదేశించి కఠినంగా శిక్షించాలనే డిమాండ్లు బాధితుల నుంచి వస్తోంది.

జాగ్రత్త పడకుంటే ఇబ్బందులే..

అక్రమ లే అవుట్లతో అధికారుల జేబులూ నిండాయి. వాటి ద్వారా కోట్లు గడించిన యజమానులు, వైసీపీ నేతలు బాగానే ఉన్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్న చందాన అక్రమ లే అవుట్ల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిన యంత్రాంగం బాగానే ఉంది. కానీ ఇప్పుడు వాటిని కొన్న మధ్య తరగతి ప్రజల్లో మాత్రం ఆందోళన నెలకొంది. వైసీపీ ఐదేళ్లలో చేసిన అక్రమాల మీద కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. దానిలో భాగంగా జిల్లాలోని మున్సిపాలిటీలతో పాటు అర్బన్ అథారిటీల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్ల జాబితాను ఇప్పటికే అధికారులు బహిరంగపరిచారు. ఆ లే అవుట్లలో ఎటువంటి క్రయవిక్రయాలు జరపకూడదనే బోర్డులు కూడా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ ఆదేశాలతో సిద్ధమయ్యారు. రేపోమాపో వాటి మీద జరిమానాల పిడుగు ఎల్ఆర్ఎస్ కింద విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మీదట ప్లాట్లు కొనేవాళ్ల లే అవుట్ల విషయంలో జాగ్రత్త వహిస్తే తర్వాత బాధలు తప్పుతాయి. ఇక మీదట లే అవుట్ల విషయంలో పారదర్శకత పాటించే విధంగా అధికారులకు ఆదేశాలివ్వడంతో పాటు వాటికి సంబంధించిన అనుమతులను పబ్లిక్ డొమైన్‌లో పెడితే ప్రజలు ఈ మోసగాళ్ల బారిన పడకుండా ఉంటారు. ఇదే సమయంలో ప్లాట్లు కొనుక్కునే ప్రజలు సైతం ఒకటికి రెండుసార్లు అనుమతుల విషయంలో విచారణ చేసుకున్న తర్వాతనే ప్లాట్ల కొనుగోలు చేయాలి లేకపోతే ఇలాంటి ఇబ్బందులు తప్పవు.

అమరావతి.. ఆహ్లాదం

- పర్యాటక రాజధానిగా అభివృద్ధికి చర్యలు
- ఏడీసీ ఆధ్వర్యంలో బ్లూ-గ్రీన్ ప్రాజెక్టుల నిర్మాణం
- శాఖమూరు, వెంకటపాలెం పర్యటనలో మంత్రి నారాయణ


శాఖమూరు సెంట్రల్ పార్కులో యంత్రంతో గడ్డి కట్ చేస్తున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 24: ప్రజా రాజధాని అమరావతిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు బ్లూ - గ్రీన్ కాన్సెప్ట్‌తో ఆకర్షణీయమైన పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారధితో కలసి వెంకటపాలెం నర్సరీ, శాఖమూరు సెంట్రల్ పార్క్‌లను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శాఖమూరు సెంట్రల్ పార్కులో జరిగిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. శాఖమూరు, అనంతవరం, నీరుకొండ ప్రాంతాల్లో అందమైన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి పర్యాటకానికి కేంద్ర బిందువుగా తీర్చి దిద్దుతామన్నారు. హైదరాబాద్ మహా నగరాన్ని పచ్చదనంతో అద్భుతంగా తీర్చిదిద్దిన సీనియర్ అధికారి లక్ష్మీపార్థసారధికి అమరావతిలో పచ్చదనం ప్రాజెక్టుల అభివృద్ధిని ప్రభుత్వం అప్పగించిందన్నారు. 300 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న శాఖమూరు సెంట్రల్ పార్కులో బోటింగ్‌కు అనువుగా 50 ఎకరాల్లో రిజర్వాయర్‌ను నిర్మించి పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. నీరుకొండలో 500 ఎకరాల్లో వాటర్ లేక్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొండవీటి వాగు పాలవాగు, గ్రావిటీ కెనాల్ వంటి నీటి ప్రాజెక్టుల వెంబడి 23-30 మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతవరంలో 35 ఎకరాల్లో ఉద్యానవనం, మల్కాపురంలో 21 ఎకరాల్లో పార్కును ఏర్పాటు చేసి వివిధ రకాల మెడిసినల్ ప్లాంట్స్ పెంచతామన్నారు.

వేమవరంలో.. రీజెన్సీ సిరామిక్

- యానాం నుంచి తరలివచ్చిన పరిశ్రమ
- సీఎం చంద్రబాబుతో ప్రారంభించేందుకు సన్నాహాలు

బల్లికురవ, ఆగస్టు 24: బల్లికురవ మండలంలో పారిశ్రామికవాడగా పేరొందిన వేమవరం గ్రామానికి పుదుచ్చేరి రాష్ట్రం యానాం నుంచి రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ తరలిరానుంది. అక్కడి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. చంద్రబాబు ప్రభుత్వం పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రీజెన్సీ చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు ముందుకొచ్చారు. కొంత కాలంగా పనులు నిలిచిపోయిన సెగ్నో సిరామిక్ ఫ్యాక్టరీలో సంస్థ కార్యకలపాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో రీజెన్సీ పరిశ్రమను ప్రారంభించేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేపడుతున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, పారిశ్రామికవాడ అభివృద్ధివైపు పరుగుపెడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వేమవరం గ్రామ పరిధిలో సుమారు 25 ఎకరాల్లో సెగ్నో సిరామిక్ టైల్స్ ఫ్యాక్టరీ దశాబ్దాల క్రితం ఏర్పాటైంది. అయితే కొంతకాలం నుంచి ఈ పరిశ్రమలో పనులు నిలిచిపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో యానాంలో కొన్నేళ్లగా మూత పడి ఉన్న రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ తిరిగి తమ వ్యాపారాన్ని ఇక్కడ ప్రారంభించేందుకు సిద్ధమైంది. శనివారం సిరామిక్ ఫ్యాక్టరీలో పూజ కార్యక్రమాలను నిర్వాహకులు ప్రారంభించారు. పరిశ్రమ ఏర్పాటైతే యువతకు ఉపాధితోపాటు నాణ్యమైన టైల్స్ ఇక్కడే అందుబాటులో ఉంటాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి వైపు వేమవరం

వేమవరం అంటే గుర్తుకొచ్చేది గ్రానైట్ ఫ్యాక్టరీలే. ఇక్కడ సుమారు 125 గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు రన్నింగ్‌లో ఉన్నాయి. పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది కార్మికులు ఉపాధిని పొందుతున్నారు. ఇప్పుడు రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ తరలి రానుండడంతో వేమవరం పారిశ్రామికవాడ అభివృద్ధి వైపు పరుగులు పెట్టనుంది.


పనుల ప్రారంభానికి పూజలు చేస్తున్న నిర్వాహకులు


ప్రారంభోత్సవానికి సిద్ధమైన రీజెన్సీ పరిశ్రమ

పోస్టింగ్‌లకు.. పోటీ

- బదిలీల కోసం భారీగా సిఫార్సులు
- ఒక్కో పోస్టుకు రెండు నుంచి ఐదు వరకు..
- ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలని హెచ్‌వోడీల ఆరా
- బదిలీ కోరుతూ 70 నుంచి 90 శాతం దరఖాస్తులు

బదిలీల నిషేధ గడువు సమీపిస్తోంది. బదిలీలకు సమయం దగ్గరకు వచ్చేసింది. అనుకూలమైన పోస్టింగ్ కోసం ఉద్యోగుల నుంచి అధికారుల వరకు పోటీపడుతున్నారు. ఎవరిస్థాయిలో వారు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు. ఒక్కో పోస్టు కోసం రెండు నుంచి ఐదు వరకు సిఫార్సులు వచ్చాయి. ఇవే కాకుండా ఇంకా కొందరు ఉద్యోగులు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దసంఖ్యలో సిఫార్సు లేఖలు రావడంతో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలనే అంశంలో ఉన్నతాధికారుల్లో గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. వైసీపీతో అంటకాగిన వారు కూడా సిఫార్సులతో సిద్ధమైనట్లు సమాచారం. దాదాపు బదిలీల దరఖాస్తులు సదరు ఉన్నతాధికారులకు, మంత్రుల పేషీలకు చేరగా వీటిపై కసరత్తు ప్రారంభమైనట్లు సమాచారం. బదిలీలపై ఉద్యోగుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎవరి సిఫార్సు లేఖలు పనిచేస్తాయో.. ఎవరివి బుట్టదాఖలు అవుతాయో ఈ నెల 31వ తేదీతో తేలుతుంది.

- ఓ మున్సిపాల్టీలో డీఈ పోస్టు కోసం ఐదుగురు లేఖలతో సిద్ధమయ్యారు. ఈ ఐదుగురులో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏ నేత సిఫార్సుకు ఆమోదం తెలిపితే ఏమవుతుందోననే ఆందోళనలో హెచ్‌వోడీలు ఉన్నాయి.
- మరికొన్ని నియోజకవర్గాల్లో కొన్ని పోస్టులకు రెండు నుంచి మూడు లేఖలు జారీ అయ్యాయి. ఓ నియోజకవర్గంలో సిఫార్సు లేఖల జారీ గందరగోళానికి దారి తీసినట్లు తెలిసింది.
- ఓ అధికారి పోస్టింగ్ విషయంలో పార్టీ నేతలు వివాదానికి కూడా దిగినట్లు సమా చారం. వైసీపీతో అంటకాగిన అధికారికి సిఫార్సు లేఖ జారీ చేయడం వల్లే ఈ వివాదం జరిగినట్టు తెలిసింది.
- కొన్నిచోట్ల ద్వితీయశ్రేణి నేతలు బేరసారాలు చేసుకుని ఎమ్మెల్యేలను మభ్యపెట్టి సిఫార్సు లేఖలు జారీ చేయించినట్లు సమాచారం. ఈ కారణంగానే ఒక్కో పోస్టుకు ఎక్కువగా సిఫార్సు లేఖలు జారీ అయినట్లు సమాచారం.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీలపై నిషేధం సడలించిన తర్వాత జరుగుతున్న ప్రహసనం. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన రెండునెలల తర్వాత బదిలీలకు ఆమోదం తెలపగా ఈ నెల 31వ తేదీని గడువుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదేళ్ల ఒకేచోట సర్వీసు పూర్తిచేసిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. రిక్వెస్ట్ విధానంలో బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో అధికారులు, ఉద్యోగులు వారికి నచ్చినచోట పోస్టింగ్‌కోసం పైరవీలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే సిఫార్సులేఖ తప్పనిసరి చేశారు. ఈ క్రమంలో పెద్దఎత్తున సిఫార్సు లేఖలు తెచ్చుకుని బదిలీ దరఖాస్తుతో ఆయా శాఖల హెచ్‌వోడీలకు అందజేసినట్లు సమాచారం. ఇలా దరఖాస్తు చేసిన ఉద్యోగులకు సంబంధించి ఈ నెల 31న బదిలీల జాబితా విడుదల అవుతుందని అధికారులు తెలిపారు. 70నుంచి 90 శాతం వరకు బదిలీలు కోరుతూ లేఖలను ఆయా శాఖల హెచ్‌వోడీలకు పంపారు. రెండు రోజుల్లో లేఖల ప్రక్రియ ముగుస్తుందంటున్నారు. బదిలీలకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలో లెక్కకు మించి సిఫార్సులేఖలు జారీ అయ్యాయి. ఒక్కో పోస్టుకు రెండు నుంచి ఐదు వరకు కూడా సిఫార్సు లేఖలు రావడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఒక పోస్టుకు ఒకటికి మించి సిఫార్సు లేఖలు అందడంతో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలో తెలియని పరిస్థితి ఆయా శాఖ హెచ్‌వోడీల్లో నెలకొన్నట్లు చెబుతున్నారు. బదిలీల దరఖాస్తులు సదరు ఉన్నతాధికారులకు, మంత్రుల పేషీలకు చేరాయి. వీటిపై కసరత్తు ప్రారంభమైంది. కొన్నిచోట్ల ఒక పోస్టుకు ఒకటి కంటే ఎక్కువగా సిఫార్సు లేఖలు జారీ కావడంతో పోస్టింగ్‌ల విషయంలో ఉన్నతాధికారులు కొంత మేర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రచారం. సిఫార్సు లేఖలు ఇప్పించడంతో పోటీ పడిన ద్వితీయ శ్రేణి నేతలు వారు రికమండ్ చేసిన వారికి పోస్టింగ్‌లు దక్కుతాయా లేదా అన్న సంశయంలో ఉన్నారు.



ఇంకా పైరవీ ప్రయత్నాల్లో పలువురు

ఇప్పటికే ఒక్కో పోస్టుకు పెద్దసంఖ్యలో సిఫార్సు లేఖలు రావడం.. ఎవరికి, ఏ లేఖకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలియని గందరగోళ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ క్రమంలో ఇంకా కొందరు పోస్టింగ్‌ల కోసం పైరవీల్లో ఉన్నారు. ద్వితీయ శ్రేణి నేతలను ఆశ్రయించి వారి ద్వారా పోస్టింగ్‌ల కోసం పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే ఒకే పోస్టింగ్‌కు ఒకటి కంటే ఎక్కువగా సిఫార్సులేఖలు జారీతో లేఖలు ఇప్పించిన నేతలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ శాఖలో డిప్యూటేషన్‌పై ఇతర శాఖల అధికారులు పనిచేస్తున్నారు. వీరికి తిరిగి పోస్టింగ్‌ల కోసం కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. విద్యా, ఆడిట్ వంటి శాఖల్లో పనిచేసిన వారిని మున్సిపల్ అధికారులుగా తీసుకురావడానికి యత్నిస్తున్నారు. అయితే డిప్యూటేషన్లను ప్రభుత్వం అంగీకరించడంలేదని చెబుతున్నారు.

వైసీపీ అధికారులకూ సిఫార్సులు..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ నేతలతో అంటకాగిన అధికారుల్లో కొందరికి కోరుకున్నచోట పోస్టింగ్‌లు దక్కేవిధంగా కూటమి నేతల ద్వారా సిఫార్సులేఖలు జారీ అయ్యాయన్న విమర్శలున్నాయి. వైసీపీ నేతలకు సహాయ సహకారాలు అందించి, అక్రమాలకు ఊతం ఇచ్చిన కొందరు అధికారులు బడా కాంట్రాక్టర్ల ద్వారా సిఫార్సు చేయించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీనిని టీడీపీ నేతలు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు.

ఏపీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రానికి 4087 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.

అర్హత: విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు; వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.

రాత పరీక్ష: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్: రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసేవరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12,000 ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/ZbiB0SEలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్)/ఏఎన్ఎం ట్రెయినింగ్

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమినర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,330 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా మిగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువ పత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

పీహెచ్‌డీ

జేఎన్‌టీయూ అనంతపురంలో..

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, రీసెర్చ్ ప్రొఫెషనల్స్, పబ్లిక్ రిప్రజంటేటివ్‌లు దరఖాస్తు చేసుకోవచ్చు.

రీసెర్చ్ విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఫార్మసీ.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు; ప్రైవేట్ ఇండస్ట్రీల్లో ఎగ్జిక్యూటివ్ కేడర్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

- **స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూ, అనంతపురం-515002
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in



కర్నూలు ఐఐఐటీడీఎంలో..

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈ)

సైన్స్ విభాగాలు: ఫిజిక్స్, మేథమెటిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కనీసం 7 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఏదేని ఇంజనీరింగ్ కళాశాల నుంచి 75 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- సైన్స్ విభాగాలకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/నెట్/ఎన్‌బీహెచ్ఎం స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులు; ఐఐటీల నుంచి 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఎంపికైన అభ్యర్థులకు విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి రెండేళ్లు నెలకు రూ.43,750 అందిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు అటెండ్ అయ్యే వారికి రూ.లక్షన్నర ఇస్తారు.

- **చివరి తేదీ:** సెప్టెంబరు 8
- **వెబ్‌సైట్:** iiitk.ac.in/

నవ్య | చిత్రజ్యోతి

నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి

● అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

పవన్ కల్యాణ్, నాగబాబు, అల్లు అర్జున్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలతో మెగా ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయంటూ కొన్నాళ్లుగా మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఇప్పటి దాకా మెగా, అల్లు కుటుంబాల నుంచి ఎవరూ నేరుగా పెదవి విప్పింది లేదు. కానీ ఇప్పుడు తొలిసారి అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఈ విషయంపై స్పందించారు. ఓ మీడియా ఛానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పుడు హీరోలు స్మగ్లర్ల వేషాలు వేస్తున్నారు' అంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, 'స్నేహితుల కోసం ఎక్కడిదాకా అయినా వస్తాను' అంటూ అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

● కల్యాణ్ గారు ఏ సందర్భంలో అలా మాట్లాడారో తెలియదు. ఆయన మాటవరసకు అలా అని ఉంటారు అని నేను అనుకుంటున్నాను. కానీ ప్రజల్లోకి తప్పుడు సందేశం పోతోంది. తర్వాతైనా ఆయన 'నా ఉద్దేశం ఇది' అని చెబితే బాగుండేది. ఆయనే స్వయంగా పూనుకొని సరిదిద్దితే బాగుండేదని నా అభిప్రాయం.



● ఎన్టీఆర్ నటుడిగా రావణుడు, దుర్యోధనుడి పాత్రలు పోషించారు. అంటే దానర్థం మొత్తం స్త్రీ జాతిని ఆయన కించపరిచాడని కాదు కదా. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. పవన్ కల్యాణ్ కూడా నటుడిగా ఉండి రాజకీయ నాయకుడయ్యారు. సినిమా యాక్టర్‌ను యాక్టర్‌గానే చూడాలి. వారి వ్యక్తిత్వాలకు ఆ పాత్రల స్వభావాన్ని అంటగట్టే ప్రయత్నం చేయకూడదు. అల్లు అర్జున్ నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి.

● అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి అవార్డ్ వచ్చింది. 69 ఏళ్లలో ఎవరికీ రాని అవార్డ్ ఆయన్ను వరించింది. ఆయన మిత్రపక్షం బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఎన్డీయే ప్రభుత్వమే అర్జున్‌కు ఉత్తమ నటుడు అవార్డ్ ఇచ్చింది. అది పవన్ కల్యాణ్‌కు తెలియదా? మంచీ చెడూ చూడకుండానే భారత ప్రభుత్వం ఆ పురస్కారాన్ని ఇవ్వలేదు కదా?. ఆయన అభిమానులేమో అల్లు అర్జున్‌నే అన్నాడు అని అనుకుంటున్నారు. ఇప్పుడు ఈ వివాదానికి శుభంకార్డు పడాలంటే 'ఇది నేను జనరల్‌గా అన్నాను' అని పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేయాలి. లేదంటే ఆయన భాగస్వామిగా ఉన్న ఎన్డీయే ప్రభుత్వాన్ని తప్పు పట్టినట్లే. భారత ప్రభుత్వ నిర్ణయాన్ని వివాదాస్పదం చేస్తున్నట్లుగానే భావించాలి. చిరంజీవి గారు పవన్ కల్యాణ్, అల్లు అర్జున్‌తో మాట్లాడి ఈ వివాదానికి ముగింపు పలకాలి.



బ్రదర్.. తప్పకరావాలి!

కమర్షియల్ తెలుగు సినిమాకు ఒక ఊపుని తెచ్చి, బాక్సాఫీసు దగ్గర సునామీ సృష్టించిన హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ. వయసుతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తూ దూసుకుపోతున్నారు. ఎన్నోసార్లు బాక్సాఫీసు దగ్గర వీరిరువురి చిత్రాలూ పోటీ పడినప్పటికీ ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా, ఒకరి మీద మరొకరు ప్రత్యేక అభిమానం కురిపిస్తూ మంచి స్నేహితులుగా మెలుగుతుంటారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భేదం ఈ ఇద్దరి హీరోలలోనూ లేదు. వృత్తిపరమైన పోటీని సినిమాలకే పరిమితం చేసి నిజజీవితంలో ఎంతో ఎమోషనల్ బాండింగ్ కలిగి ఉంటారు చిరంజీవి, బాలకృష్ణ. గురువారం రాత్రి జరిగిన గీత రచయిత రామజోగయ్యశాస్త్రి ఇంట జరిగిన వివాహ వేడుకలో ఈ అనుబంధం మరోసారి ఆవిష్కృతమైంది. ఈ వేడుకకు చిరంజీవి, బాలకృష్ణ హాజరయ్యారు. చిరంజీవి ఎదురు పడగానే 'బ్రదర్.. ఎలా ఉన్నారు?' అని ఆప్యాయంగా పలకరించారు బాలకృష్ణ. ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత సెప్టెంబర్ ఒకటిన జరిగే తన సన్మాన కార్యక్రమానికి తప్పకుండా రావాలని చిరంజీవిని ఆహ్వానించారు. వస్తానని చిరంజీవి చెప్పారు. అలాగే 'అన్‌స్టాపబుల్' కార్యక్రమం గురించి కూడా వీరిద్దరి మధ్య సంభాషణ జరిగిందని సమాచారం.

కాలం కలిసొస్తే నడిచొచ్చే సినిమా



నాని హీరోగా నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'సరిపోదా శనివారం' ఈ నెల 29న విడుదల కానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి చాలా చెప్పేశాను. దర్శకుడు వివేక్ ఇందులో శివ తాండవం చూపించాడు. అతని కెరీర్‌కి ఈ సినిమా ఓ మైల్‌స్టోన్. మా కష్టాన్ని చూసి మీరు ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నా. కాలం కలసి వస్తే నడిచి వచ్చే సినిమా వస్తుందంటారు. అటువంటి సినిమానే 'సరిపోదా శనివారం' అన్నారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'మా దర్శకుల కుటుంబం అంతా ఈ వేడుకకి వచ్చి ఆశీస్సులు అందజేశారు. ఈ సినిమా 29న విడుదల చేయడానికి దర్శకుల టీమ్ కూడా ఓ కారణం. నాని నా మీద ఉంచిన నమ్మకానికి 'సరిపోదా శనివారం' ఇచ్చా' అన్నారు. 'ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. నాని కథల ఎంపికలో బెస్ట్. కథ నచ్చితే కొత్త దర్శకుడైనా అవకాశం ఇస్తారు. ఆయనతో సినిమా చేస్తే నిర్మాతకు ఏ టెన్షన్ ఉండదు' అన్నారు నిర్మాత దానయ్య. ఒక రకమైన యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు వివేక్ విభిన్నంగా మలిచారని ఎస్.జె.సూర్య ప్రశంసించారు.



ఇన్ ప్రోగ్రెస్

టైటిల్ సాంగ్ వచ్చేసింది



బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్‌కృష్ణ హీరోగా నవీన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బాయ్'. సతీశ్ కుమార్ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌గా టైటిల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ మూవీలో చాలా ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి" అని చెప్పారు.

మహిళలకు మాత్రమే



నూతన నటీనటులతో తెరకెక్కిన చిత్రం 'ఎంత పనిచేశావ్ చంటి'. ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ నిర్వహించింది. దర్శకుడు నక్కిన త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథతో 'ఎంత పనిచేశావ్ చంటి' చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమాను మగవాళ్లు చూడకూడదు. మహిళలు మాత్రమే చూడాలి' అని అన్నారు. శ్రీనివాస్ ఉలిశెట్టి, దియారాజ్, నిహారిక శాంతిప్రియ జంటగా నటించారు. సంగీతం: పవన్ సినిమాటోగ్రఫీ: సంతోష్.

పెద్ద హిట్టవ్వాలి



లక్షణమూర్తి రతన, భ్రమరాంబిక తూటిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సీతారామ్ సిత్రాలు'. డి.నాగ శశిధర్ రెడ్డి దర్శకత్వంలో పి.పార్థసారథి, డి.నాగేంద్ర రెడ్డి, కృష్ణ చంద్ర విజయబట్టు నిర్మిస్తున్నారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్ జగన్నాథ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

అందరూ ప్రశంసిస్తున్నారు



ఇటీవలే 'ఆయ్' సినిమాకు ఆకట్టుకునే సంగీతాన్ని అందించారు అజయ్ అరసాద. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను 'ఆయ్' చిత్రంలో సంగీతం అందించిన మూడు పాటలు అందరికీ విపరీతంగా నచ్చాయి. పాటలతో పాటు నేపథ్య సంగీతానికి విశేషాదరణ లభిస్తోంది. ఎంతో మంది మంచి సంగీతం ఇచ్చావని ప్రశంసిస్తున్నారు. ఓ సంగీత దర్శకుడిగా అన్ని జోనర్ సినిమాలు చేయాలనుంది. ప్రస్తుతం రెండు చిత్రాలకి సంగీతం అందిస్తున్నాను" అని చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో...



తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'బంపర్'. ఇప్పుడు అదే పేరుతో తెలుగులోనూ రాబోతోంది. వెట్రి, శివాని నారాయణ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఎమ్. సెల్వకుమార్ దర్శకత్వం వహించారు. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సెల్వకుమార్ మాట్లాడుతూ "ఓ లాటరీ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో వినోదంతో పాటు బోలెడు థ్రిల్లింగ్ అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

సోషల్ మీడియా టు సినిమా

ఒకప్పుడు సినిమాల్లోకి రావాలంటే చాలా తతంగం ఉండేది. ఫొటోల ఆల్బమ్ చేతో పట్టుకుని ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఫొటోలు నచ్చితే ఆడిషన్స్‌కు పిలుపు వచ్చేది. ఆడిషన్స్‌లో ఓకే అనిపించుకున్నా అవకాశం వస్తుందో రాదో తెలియని పరిస్థితి.. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆర్టిస్టులను ఎంపిక చేసే విధానమూ మారింది. సోషల్‌మీడియాలో కొంత హల్‌చల్ చేస్తే చాలు సినిమాల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చేస్తున్నాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లే వేదికగా తమ టాలెంట్ ప్రదర్శించి, సినిమాల్లోకి ఎంట్రీ సంపాదించిన నటీమణులు కొందరున్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం.



యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో డ్యాన్స్ రీళ్లతో అదరగొడుతూ లక్షలాది మందిని ఆకర్షించారు ఇమాన్ ఇస్మాయెల్ (ఇమాన్వీ). రీల్స్ చేయడమే కాకుండా ఆమె ఓ షార్ట్ ఫిల్మ్‌లోనూ నటించారు. యూట్యూబ్‌లో దాదాపు రెండు మిలియన్ల సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాలో దాదాపు తొమ్మిది లక్షల ఫాలోవర్లు ఆమెకు ఉన్నారు. దాంతో ఇప్పుడీ ఢిల్లీ భామ ఏకంగా ప్రభాస్ సరసన నటించే లక్కీ ఛాన్స్ పొందింది. తొలి సినిమానే పాన్ ఇండియా ఫిల్మ్ కావడం గ్రేట్ కదా! 1940ల నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకుడు.

గీతా ఆర్ట్స్‌లో..

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, రీల్స్ ద్వారా ఫేమస్ అయిన మరో కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్.ఎమ్. ఆమె కూడా నటిగా టాలీవుడ్‌లోనూ.. కోలీవుడ్‌లోనూ అడుగుపెట్టనున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించే ఓ తెలుగు చిత్రంలో.. ఆకాశ్‌భాస్కర్ దర్శకత్వంలో అధర్వ హీరోగా ఓ తమిళ సినిమాలోనూ నటిస్తున్నారు. నిహారిక ఇటీవలే అమెరికన్ యానిమేటెడ్ కామెడీ టెలివిజన్ సిరీస్ 'బిగ్ మౌత్' సీజన్ 7లో ఓ క్యారెక్టర్‌కు వాయిస్ కూడా అందించడం విశేషం. పలు సామాజిక సమస్యలపై సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు చేసే నిహారికకు యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు... ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లు మిలియన్లలో ఉన్నారు.

'బేబీ' కాంబోలో..

సోషల్ మీడియాను తెలివిగా వాడుకుని సినిమాల్లో ఎంట్రీ కార్డ్ దక్కించుకున్న తెలుగమ్మాయి అలేఖ్య హారిక (దేత్తడి హారిక). యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్. కవర్ సాంగ్స్. వెబ్ సిరీస్‌లలో నటించి పాపులర్ అయ్యారు. ఆమె ప్రస్తుతం సంతోష్ శోభన్ హీరోగా సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్.కే.ఎన్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు.

వరుసగా నాలుగో చిత్రం

సోషల్ మీడియాతో వరుస అవకాశాలు తెచ్చుకున్నారు కేరళకు చెందిన అనంతిక సనీల్‌కుమార్. కంటెంట్ క్రియేటర్‌గా ఓ వైపు రాణిస్తూనే.. క్లాసికల్ డ్యాన్సర్‌గా.. కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్‌గా పలు రంగాల్లో పట్టు తెచ్చుకున్నారు. ఇప్పటికే మూడు చిత్రాల్లో నటించారు. 'రాజమండ్రి రోజ్‌మిల్క్' చిత్రంతో తెరంగేట్రం చేసి.. 'మ్యాడ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ప్రస్తుతం 'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి దర్శకత్వం వహిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

వీళ్లతో పాటు సోషల్‌మీడియాను కేరాఫ్ అడ్రస్‌గా వాడుకుని ఇప్పటికే ఎంతో మంది తారలు సినిమాల్లో అవకాశాలు పట్టేశారు. వారిలో 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ఒకరు. షార్ట్ ఫిల్మ్స్.. సినిమాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె కెరీర్‌ను 'బేబీ' సినిమా సక్సెస్ ఒక్కసారిగా మార్చేసింది. వైష్ణవిని ఓవర్‌నైట్ స్టార్‌ను చేసి వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది. మరో నాయిక రుహాని శర్మ కూడా సోషల్ మీడియా నుంచి వెండితెర ప్రయాణం చేసి 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' 'చి.ల.సౌ. స్రవంతి' చిత్రాలలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మోడల్‌గా ట్రయిల్స్ దశలో ఉన్న సాక్షి వైద్య సోషల్‌మీడియాలో తన ఫొటోల ద్వారా సినిమా అవకాశాలు దొరకబుచ్చుకున్నారు. అలా ఆమె 'ఏజెంట్' చిత్రంలో తళుక్కుమన్నారు. ఆ సినిమా సక్సెస్ కాకపోయినా.. ఈ అమ్మడుకు మాత్రం మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ కోవలోకి చెందిన వారే.. 'బీస్ట్' ఫేమ్ అపర్ణా దాస్, 'రొమాంటిక్', 'అంగరంగ వైభవంగా' ఫేమ్ కేతిక శర్మ, 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంక జవాల్కర్. ఇలా ఎంతో మంది సోషల్ మీడియా స్టార్స్‌కు సినిమా తలుపులు తెరుస్తూనే ఉంది. మరి వీరిలో ఎంత మంది హీరోయిన్లుగా నిలబడతారో వేచి చూడాలి.













వర్సిటీలో అరబిక్ భాషపై సర్టిఫికెట్ కోర్సు

పెదకాకాని, ఆగస్టు 24: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో "సర్టిఫికెట్ కోర్స్ ఇన్ అరబిక్ లాంగ్వేజ్" అనే మూడు నెలల కోర్సును ప్రారంభిస్తున్నట్లు ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి శనివారం తెలిపారు. ఈ కోర్సు తరగతులను గుంటూరులోని అభ్యుదయ మహిళా కళాశాల ప్రాంగణంలో ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటలు పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుతో గల్ఫ్ దేశాలలో, కార్పొరేట్ కంపెనీలలో అపార ఉద్యోగావకాశాలు ఉంటాయని విశ్వ విద్యాలయ ఇంచార్జి ఉపకులపతి ఆచార్య గంగాధరరావు తెలిపారు. ఈ కోర్సుకు 8వ తరగతి చదివిన వారు అర్హులని, ఈ కోర్సుకు మూడు నెలలకుగానూ రూ.2,000 చెల్లించాలని విశ్వవిద్యాలయ ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహచలం తెలియజేశారు. గల్ఫ్ దేశాలలో ఉద్యోగాలు చేయాలి అనుకునేవారు, సద్వినియోగం చేసుకోవాలని విశ్వవిద్యాలయ ఇన్చార్జి రెక్టార్ ఆచార్య రత్న షీలామణి సూచించారు. అభ్యర్థులు అభ్యుదయ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రోహిణి దేవిని సంప్రదించాలన్నారు. వివరాలకు 0863- 2231359, 9848139454 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సాంకేతిక అన్వేషణలో భారత్ అగ్రస్థానం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ
- అట్టహాసంగా విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం
- ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌లు
- 1,539 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- 60 మంది విద్యార్థులకు బంగారు పతకాలు



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య



లోకేష్ మెషిన్స్ అధినేత ముళ్ళపూడి లోకేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న జస్టిస్ శ్రీనరసింహా

గుంటూరు(విద్య),ఆగస్టు 24: సాంకేతిక అన్వేషణలో భారత్ అగ్రస్థానంలో ఉందనీ, కొత్త పద్ధతులను అనుసరించడం వలన యువత సులువుగా లక్ష్యాన్ని సాధించే అవకాశం ఉందని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ చెప్పారు. ప్రపంచం విభిన్న నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల కోసం ఎదురుచూస్తోందని ఉద్ఘాటించారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం 12వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శనివారం వర్సిటీ ప్రాంగణంలో స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ మాట్లాడుతూ యువత డిగ్రీ పట్టాలతో సంస్థ సరిహద్దులను దాటి వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారని, ఇప్పుడే కొత్త సవాళ్లను అధిగమించాలని సూచించారు. జీవితంలోని ప్రతి అంశం లోతైన విప్లవానికి నాంది పలుకుతుందన్నారు. ఉత్సుకత ఎక్కడికి దారితీస్తుందో దానిని అన్వేషించాలని, మూస ధోరణిలో వెళ్లకుండా మార్పును స్వాగతించాలన్నారు.

ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు

12వ స్నాతకోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కృషి చేసిన హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరిరావు, హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లంపూడి లోకేశ్వరరావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి) లకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది.

ఏఐ విస్తరిస్తుంది..

విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ 12వ స్నాతకోత్సవం సందర్భంగా 1539 మంది విద్యార్థులకు డిగ్రీలు, 60 అకడమిక్ గోల్డ్ మెడల్స్ అందించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లంపూడి లోకేశ్వరరావు మాట్లాడుతూ వృత్తిపరమైన విజయాలను కుటుంబం, స్నేహితులు, శ్రేయోభిలాషులతో జరుపుకోవడానికి ఇది ఒక చిరస్మరణీయ వేదికని అన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కొత్త శకం ప్రవేశంలో ఉన్నామని, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మనం పని చేసే విధానం నుంచి ఇతరులతో మనం కనెక్ట్ అయ్యే విధానం వరకు మన జీవితంలోని ప్రతి కోణాన్ని విస్తరిస్తుందని పేర్కొన్నారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగిస్తూ పట్టభద్రులవుతున్న మీరందరూ ప్రపంచంపై మీ ముద్ర వేయడానికి ప్రయత్నించండని పిలుపునిచ్చారు. డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తింది. విద్యార్థులు తలపాగా, కండువా వేసుకుని అచ్చతెలుగు పెద్ద మనుషుల్లా కనిపించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీవీసీ ఆస్పత్రి సేవలు అభినందనీయం



డీవీసీ కార్డియాక్ ఐసీయూను ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- సంగం నూతన కార్డియాక్ ఐసీయూ ప్రారంభం

పొన్నూరుటౌన్ (చేబ్రోలు) ఆగస్టు24: లాభాపేక్ష లేకుండా గ్రామీణ ప్రాంతంలో డీవీసీ ఆస్పత్రి అందిస్తున్న కార్పొరేట్ వైద్య సేవలు అభినందనీయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వడ్లమూడి సంగం డెయిరీ డీవీసీ ఆస్పత్రిలో శనివారం డీవీసీ కార్డియాక్ ఐసీయూ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను ఆయన సందర్శించారు. సంగం ఆవరణలోని మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రారంభించిన ఆరేళ్ల కాలంలోనే డీవీసీ ఆస్పత్రి ప్రజల మన్ననలు చూరగొందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఈ ప్రాంత రైతుల, ప్రజల సంక్షేమం కోసం తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అభినందించారు. సంగం డెయిరీ విలువైన బ్రాండ్‌గా రూపాంతరం చెందుతుందన్నారు. తక్కువ కాలంలో పది సూపర్ స్పెషాల్టీ సేవలు, 15 స్పెషాల్టీ సేవలను అందిస్తుందన్నారు. రాష్ట్రంలో కౌమార దశ బాలికలు 51 శాతం మంది రక్తహీనతలో బాధపడుతునట్లు చెప్పారు. గర్భిణీల్లో 37 శాతం మంది రక్తహీనతతో ఉన్నారన్నారు. క్యాన్సర్ వల్లన తన తల్లి, అక్క బాధ పడ్డారని, రాష్ట్రంలో 5.30 కోట్ల మందికి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించబోతునట్లు చెప్పారు.

సంగం వ్యవస్థకు సేవకులమే...

ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సంగం వ్యవస్థకు సేవకులమే గానీ యజమానులం కాదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్, సీవోవో డాక్టర్ కరణం నవీన్, డాక్టర్ దక్షిణామూర్తి, పలు విభాగాల వైద్యులు, సంగం పాలకవర్గ సభ్యులు, పాల రైతులు పాల్గొన్నారు.

1.0615 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 24: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0615 ఎంయూల విద్యుదుత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. 3 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి దిగువకు 21,240, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,850 మొత్తంగా 30,090 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 7.0390 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.44 మీటర్లకు సమానమన్నారు. విద్యుదుత్పత్తిలో ఈ ఏడాది లక్ష్యాన్ని అధిగమించినట్లు ఎస్ఈ చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెలాఖరు వరకు విద్యుదుత్పత్తి లక్ష్యం 15 ఎంయూలు కాగా శుక్రవారం అర్ధరాత్రి వరకు 16.75 ఎంయూల విద్యుత్ తయారైందని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

ఆరోగ్యసేవలు గ్రామాలకు విస్తరించాలి

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, పక్కన భాష్యం రామకృష్ణ

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 24: స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా గ్రామీణ ఆరోగ్య ప్రమాణాలు మెరుగవుతాయని లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. శనివారం గుంటూరులోని ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, మానవత, కొరిటాల ఇందిర శేషగిరిరావు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ అందిస్తున్న సేవలను అభినందిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని శాఖలు ఈ కృషిని కొనసాగించాలన్నారు. నగరంలోని కొరిటెపాడులో ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ అభినందించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ సేవా రంగాలలో ఉండాల్సిన విద్య, వైద్యం కార్పొరేట్‌గా మారడం వలన పేదలు అప్పుల పాలవుతున్నారని, ఇలాంటి వైద్య శిబిరాలతో కొంతమేర ఊరట కలిగించవచ్చున్నారు. బ్యాంకు మేనేజర్ కోటా బుల్లి కుమార్ మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీ రేట్లతో విద్యా రుణాలు అందిస్తూ పేద ప్రజలకు సాయ పడుతున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో పాటిబండ్ల శివాజీ, పి.ప్రసన్నకుమార్, యస్.వి. పద్మజ, శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది హాజరై 150 మంది రోగులకు సేవలను అందించారు. గురజాల పట్టణానికి చెందిన వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్, కొరిటాల శేషగిరిరావు, ఇందిర, మానవత చైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.సతీష్, టి.ధనంజయ రెడ్డి, బ్యాంక్ కమిటీ మెంబర్స్ కోట మాల్యాద్రి, ఎస్.లక్ష్మీ సుజాత, కె.రమణ బాబు, యస్.సాంబశివరావు, వి.సుబ్రహ్మణ్యం, గురవారెడ్డి, లక్ష్మీ సామ్రాజ్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యునివర్సిటీ లో పలువురికి పదోన్నతులు

పెదకాకాని, ఆగస్టు 24 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం పలువురికి పదోన్నతులు లభించాయి. ఈమేరకు ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య కె. గంగాధర రావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కె. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం లు పదోన్నతులు పొందిన వారికి ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతులు పొందిన వారిలో డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ హోదాలలో 29 మంది ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంలో పదోన్నతులు పొందిన ఉద్యోగులు ఉపకులపతి, రెక్టర్, రిజిస్ట్రార్ లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికాస ప్రధాన కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, ఎన్జీవో యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 24: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,076 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,867 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పోలీసు శాఖను ప్రజలకు చేరువచేసేందుకు పల్లెనిద్ర

● ఎస్పీ తుషార్ డూడీ



ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, ఆగస్టు 24 : జిల్లా పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఈ విషయమై శనివారం ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించటానికి వినూత్నంగా సమర్థవంతమైన విధానాన్ని తీసుకురావటం జరిగిందన్నారు. పోలీసుశాఖకు ప్రజల సహకారం తోడైతే మరింత సమర్థవంతంగా నేరాలను నియంత్రించవచ్చు అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్ధవంతంగా అమలు చేసేందుకు, గ్రామీణప్రాంతాల ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించటం కోసం కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని అనేక గ్రామాలలో శుక్రవారం రాత్రి పోలీసు అధికారులు, సిబ్బంది పల్లెనిద్ర చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలలోని ప్రజలతో సమావేశాలు నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకోవటం జరిగిందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గురించి సమాచారం సేకరించటం జరిగిందన్నారు. పాతనేరస్తులు, చెడునడత కలిగిన వ్యక్తుల గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. కొత్తవ్యక్తులు, అనుమానితుల వివరాలు సేకరించటంతోపాటు స్థానికంగా ఉన్న స్థలవివాదాలు వర్గ విబేధాలు, పేకాట, కోడిపందాలు, ఇతర అసాంఘికకార్యకలాపాలను కట్టడి చేసేందుకు నిర్వహిస్తున్న ఒక ప్రత్యేకమైన కార్యక్రమని ఎస్పీ వివరించారు.

రాజకీయ వైషమ్యాలను విడనాడాలి

● జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 24 : గ్రామాలలో రాజకీయ వైషమ్యాలను విడనాడి ప్రజలు శాంతియుత జీవనం గడపాలని జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు అన్నారు. మండలపరిధిలోని చందోలు గ్రామపంచాయతీలోని పెదహరిజనవాడ గ్రామంలో శుక్రవారం రాత్రి చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ పోలీసు స్టేషన్ సిబ్బందితో కలిసి అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు పల్లెనిద్ర చేశారు. పెదహరిజనవాడ గ్రామంలోని ప్రజలతో ఎస్పీ మమేకమై వారితో గ్రామంలోని సమస్యలపై చర్చించారు. గ్రామ ప్రజల స్థితిగతులను, వారి సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు, శాంతిభద్రతల పరిరక్షణకు గ్రామాలలో రాజకీయ విభేదాలను విడనాడి గొడవలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామస్థులు ఎస్పీతో మాట్లాడుతూ చర్చిల వద్ద లౌడ్ స్పీకర్లు మూలంగా తమ పిల్లల చదువులకు ఆటంకం కలుగుతుందని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతోపాటు చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

పిట్టలవానిపాలెం, ఆగస్టు 24 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నబోజన పథకం పేరుతో అమలు చేస్తున్నట్లు పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చందోలు గ్రామపంచాయతీ జడ్ ఎ స్ట్రీట్‌లోని ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే నూతన మధ్యాహ్నబోజన పథకాన్ని, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు అందించే మౌలికసదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర విద్యాబోధనలో విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి తర్ఫీదు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు బత్కరున్నీసా, ఉపాధ్యాయులు, ఎండీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో ఉయ్యూరి వెంకటేశ్వరరావు

జగన్ శవరాజకీయాలను అసహ్యించుకుంటున్న ప్రజలు

● సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి

బాపట్ల, ఆగస్టు 24 : అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన పెనుప్రమాద బాధితులను ఆసుపత్రిలో పరామర్శించే పేరుతో వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నవ్వుతూ చంద్రబాబునాయుడు పాలనపై దుమ్మెత్తి పోస్తూ ప్రగల్బాలు పలకటం నీచసంస్కృతికి నిదర్శనమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. తన ప్రభుత్వం పరిశ్రమల భద్రత కోసం తీసుకొచ్చిన జీవోను చంద్రబాబు ప్రభుత్వం అనుసరించనందునే ఈ ప్రమాదం జరిగిందని జగన్ అబద్దాలు పలకటం సిగ్గు చేటు అన్నారు. ఈ విధంగా జగన్ చేసే శవరాజకీయాలను జనం అసహ్యించుకుంటున్నారని కొల్లా అన్నారు.

బాపట్ల డీఎస్పీగా రామాంజనేయులు



బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజనేయులు

బాపట్ల, ఆగస్టు 24 : బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన సీహెచ్ మురళీకృష్ణ బదిలీపై వెళ్ళటంతో గత కొద్ది రోజులుగా డీఎస్పీ పోస్ట్ భర్తీ చేయలేదు. ఇటీవల పోస్టింగ్ ఇవ్వటంతో రామాంజనేయులు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలను చేపట్టిన ఆయనను పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత అవసరం

కొల్లూరు, ఆగస్టు 24 : జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో శనివారం కొల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ టి.రంగారావు మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, నీరు వృథా చేయవద్దని, సంరక్షించే బాధ్యత అందరిదన్నారు. ప్రతిరోజు గోరువెచ్చని నీటిని తాగడం ఆరోగ్యానికి మంచిదన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్యోతి మాట్లాడుతూ, ఈ అతిసార వ్యాధి వచ్చినప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం మంచిదన్నారు. అనంతరం ర్యాలీలో డయేరియాను అంతం చేయడమే మా పంతం అంటూ నినాదాలు చేశారు. హెచ్ఎం ఉషారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉమామహేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, మండల సమన్వయ కర్తలు, ఆశలు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న జల్‌జీవన్ మిషన్ సభ్యులు

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

రేపల్లె, ఆగస్టు 24 : పట్టణంలోని భాష్యం స్కూల్లో శనివారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులచేత శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణతో అందంగా అలంకరించి నృత్యప్రదర్శన చేయించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులచే ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల జోనల్ అధికారి హైందవ్‌రాజ్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జననానికి ముందే ఆయనను ఎలా చంపాలో అనే కుయుక్తులు పన్నటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణులు, గోపికల వేషధారణలో భాష్యం స్కూల్ విద్యార్థులు

విష వాయువుల కలకలం

● కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు తప్పిన ప్రమాదం

● ఊపిరిపీల్చుకున్న అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు

బాపట్ల, ఆగస్టు 24: మండలంలోని సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ప్రయోగం వికటించి విషవాయువులు వెలువడటంతో కలకలం రేగింది. శనివారం ఉదయం సైన్స్ ఉపాధ్యాయురాలు ఆరో తరగతి విద్యార్థులకు ప్రయోగం చూపి వెళ్లారు. టేబుల్‌పై క్లోరోఫిల్, యాసిడ్, నిమ్మఉప్పు వంటి ద్రావణాలకు కొందరు విద్యార్థులు తమతో తెచ్చుకున్న పంచదార, కాఫీపొడిని కలిపి శానిటైజర్ పోసి టిష్యూ పేపర్‌తో కలిపారు. దీంతో ఆ సమయంలో అక్కడ పొగలు వచ్చి దుర్వాసనతో 6వ తరగతి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పక్కన ఉన్న 7వ తరగతి గదిలోకికూడా విషవాయువులు వ్యాపించటంతో వారు ఊపిరాడక శ్వాస తీసుకోవటంతో ఇబ్బంది పడుతూ బయటకు పరుగులు తీశారు. గమనించిన ఉపాధ్యాయులు వారికి ప్రథమ చికిత్స చేయించి బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో జేసీ సుబ్బారావు ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శించి వారి పరిస్థితిపై ఆరా తీశారు. కలెక్టర్ జె.వెంకటమురళి పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ విద్యార్థుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



ఏరియావైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ సుబ్బారావు

ఏమి జరిగిందో తెలియలేదు : ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

విద్యాలయంలోని విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఏమి జరిగిందో తెలియదని చెప్పారు. పిల్లలు శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా ఉందని గుర్తించి వెంటనే ప్రథమచికిత్స చేయించి ఆస్పత్రికి తీసుకువెళ్లామన్నారు. సంఘటన గురించి తెలుసుకున్న బాపట్ల ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారులు వైద్యశాలకు వచ్చి వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులు వీరే

విషవాయువులు వెలువడి అస్వస్థతకు గురైన వారి వివరాలను సూపరింటెండెంట్ తెలిపారు. శ్రావ్య, రమ్యశ్రీ, ప్రజ్ఞా, రిష్మితశాన్వి, వినయ్‌కుమార్, కీర్తన, దవాల్, దేవాన్షి, వరుణ్‌తేజ్, మహాలయ, రోజియా, కౌశిక్, సాయిప్రభ, మధురియ, అరుణ, శశికాంత్, క్రాంతికుమార్, గణేష్, షణ్ముఖ్, మనిషా, అహ్మద్, అరువషాహు, జె.నవ్య, ప్రణవ్యలు ఉన్నారు. వీరిలో 24మందిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు.

పరామర్శించిన నాయకులు

ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. టీడీపీ పట్టణ, మండలాధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, మస్తాన్‌బి, పద్మా, రజనీ, ఇంద్రజ, జయ, మాజీ కౌన్సిలర్ పరిశా రమేష్, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి మెరుగు పడేవరకు అక్కడే ఉన్నారు. జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైసీపీ నాయకులు జోగి రాజా పార్టీశ్రేణులతో కలిసి పరామర్శించారు. దళిత సంఘాలనాయకులు పర్రె కోటయ్య, గుదే రాజారావు, కొచ్చెర వినయ్ రాజు తదితరులు విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలు అందుబాటులో లేకపోవటంతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో సమాచారం తెలుసుకుని విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలందించేలా చూశారు.



వైద్యశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు



విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, పార్లమెంట్ టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి సరోజని

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు, విద్యార్థినులు

రేపల్లె, ఆగస్టు 24 : కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను తక్షణమే శిక్షించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరిపించి అసలైన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళా విద్యార్థినుల రక్షణ కోసం కఠిన చట్టాలు అమలు చేయాలని, చట్టసభల్లో కొత్త చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నిందితులను అరెస్టు చేయటంలో విఫలం చెందిందని, అక్కడ ఒక మహిళ ముఖ్యమంత్రి స్థానంలో కొనసాగుతూ మహిళలకు రక్షణ కల్పించకపోవటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఝాన్సీ, వై.నవీన్, పి.ఏలియా, వై.నాగార్జున, పి.భవాని, కె.గోపి, లక్ష్మణ్‌రావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి సంఘీభావంగా శాంతియాత్ర

బాపట్ల, ఆగస్టు 24 : కోల్‌కత్తాలోని ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయటాన్ని నిరసిస్తూ శనివారం సంఘీభావంగా శాంతియుతంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి రథంబజారు మీదగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి తిరిగి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. స్వాతంత్ర్యం సిద్దించి ఇన్ని సంవత్సరాలు గడుస్తున్న మహిళలకు మాత్రం స్వాతంత్ర్యం దూరంగానే ఉందని బాపట్ల జిల్లా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాము అన్నారు. దీనికి సంబంధించిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రామాంజనేయులు, ఎం.సాంబయ్య, బి.రత్నరాజు, నాగేశ్వరరావు, జె.శివబాబు, చింతరంజన్, శంకర్, డాక్టర్ కాగిత వరప్రసాదరావు, రాఘవులు, శ్యామ్, రాజశేఖర్, భాస్కరరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న నాయకులు

కొల్లూరులో విద్యార్థుల మానవహారం, నిరసన

కొల్లూరు, ఆగస్టు 24 : కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విద్యార్థినులు నిరసన ప్రదర్శన చేశారు. కొల్లూరులో సాయివాసవీ, చైతన్య విద్యా సంస్థలతో పాటు జూనియర్ కళాశాల విద్యార్థినులు వైద్యురాలిపై జరిగిన దారుణాన్ని నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి ఆడపిల్లలకు రక్షణ కల్పించాలంటూ నినదించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వడ్డీ లేని రుణాలు



విద్యార్థినులకు చెక్కులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 24 : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ నూతనంగా ప్రవేశ పెట్టిన విద్యానిధి పథకం ద్వారా మండలంలోని ఆరుగురు విద్యార్థులకు వడ్డీ లేని రుణాలను అందించారు. ఈ పథకం కింద ఇంటర్ నుంచి డిగ్రీ చదివే విద్యార్థులకు ఒక్కో విద్యార్థినికి చెక్కు రూ.25 వేలు, వడ్డీ లేని రుణంను సంస్థ సభ్యులు శనివారం అందించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్స్ నంబూరు నాగభూషణం, చెన్నా ఉమామహేశ్వరరావు, ఆర్‌సి కూరాళ్ల రవికుమార్, శనగపల్లి శ్రీనివాసప్రసాద్, గుప్తా, బొల్లిశెట్టి శ్రీనివాసరావు, బూర్లె రాంప్రసాద్, మెంటా సాంబశివరావు, వాసవి క్లబ్ భట్టిప్రోలు ప్రెసిడెంట్ బూర్లె సుబ్బారావు, సెక్రటరీ నాగ వెంకటరవితేజ, బూర్లె వెంకటచంద్రశేఖరరావు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

కొల్లూరు, ఆగస్టు 24 : వరి గడ్డి వామి దగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని క్రాపలో కొక్కిలిగడ్డ లక్ష్మయ్యకు చెందిన ఐదున్నర ఎకరాల గడ్డి వామికి నిప్పంటుకుంది. పొగలు రావడంతో గుర్తించిన స్థానికులు వెంటనే మంటలను అదుపు చేశారు. ఎవరో కావాలనే వామికి నిప్పు అంటించి ఉంటారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రమాదవశాత్తు రైలు కిందపడి వృద్ధురాలి మృతి

బాపట్ల రూరల్, ఆగస్టు 24 : ప్రమాదవశాత్తు రైలు కిందపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం బాపట్ల రైల్వేస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. రైల్వే పోలీసు తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్‌నగర్ గ్రామానికి చెందిన ద్వారం నాగేంద్రమ్మ (67) అనే వృద్ధురాలు ఒంగోలు నుంచి ప్యాసింజర్ రైలులో బాపట్ల మూడో ప్లాట్‌ఫారం వద్ద దిగి పట్టాలు దాటుతుండగా 1వ నెంబరు ప్లాట్‌ఫారం రైల్వే పట్టాలపై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాగా ఆ వృద్ధురాలిని ఢీకొట్టింది. అక్కడికక్కడే మృతి చెందగా మృతురాలి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. ఈమేరకు రైల్వేపోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైడ్ వితరణ

నగరం, ఆగస్టు 24 : మండలంలోని పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నెహ్రహా రూ.20 వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫైడ్‌ను అందించారు. ఈ సందర్భంగా మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ లాజర్ మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పటంతో పాటు విద్యార్థుల అవసరాలు తీర్చే విధంగా ఉపయోగపడటం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.బద్రీనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బారావు, ఉపాధ్యాయులు రాఘవయ్య, సుదర్శన్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 24 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ మేక శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, ఓలేరు దగ్గర ఉన్న తూర్పుపాలెం వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో పోలీసు, రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్ శాఖలు వెళ్లగా అక్కడ లేరన్నారు. అయితే ఇసుక అక్రమంగా తరలించుకునేందుకు మూడు గుట్టలుగా నిల్వ చేసినట్లు గుర్తించామని, అది 256 మెట్రిక్ టన్నులు నిల్వగా గుర్తించడం జరిగింది. అక్రమ రవాణా సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎస్ఐ శివయ్య పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులను పాటించాలి

● బాపట్ల ఏడీఏ అక్తర్ హుస్సేన్

చుండూరు, ఆగస్టు 24 : రైతాంగం పంట సాగు విధానాల్లో ఎప్పటికప్పుడు మారుతున్న ఆధునిక పద్ధతులను ఆచరించడం ద్వారా పెట్టుబడులను తగ్గించుకోవచ్చునని బాపట్ల ఏడీఏ అక్తర్ హుస్సేన్ తెలిపారు. మోదుకూరులో శనివారం జరిగిన రైతు శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడుతూ రైతులు వరి పైరులో ఎరువుల యాజమాన్యం, సూక్ష్మపోషకాలు ఆవశ్యకత గురించి గుర్తెరిగి సమయానుకూలంగా ఎరువులను వినియోగించుకోవాలన్నారు.

ఆకు ముడత, దోమ, ఉల్లికోడు వంటివి సమర్థ వంతంగా నిర్మూలించడానికి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి ఆయన వివరించారు. మండల వ్యవసాయాధికారి ఆదాంబాబు మాట్లాడుతూ రైతాంగం ఈ పంట నమోదుతో పాటు ఈకేవైసి కూడా చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్యాకుమారి, శాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

రెండు దశల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

● నియోజకవర్గ ఎన్నికల అధికారి సుశీల

వేమూరు, ఆగస్టు 24 : కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు దశల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని వేమూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి సుశీల అన్నారు. శనివారం ఆమె వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇంటింటి ఓటర్ల జాబితాను సాధించే ఉద్దేశ్యంతో ఈ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. రివిజన్ కార్యకలాపాలతో సమానమైన వెయిటేజ్ ప్రీ రివిజన్ కార్యకలాపాలకు ఇవ్వబడుతుందన్నారు. ఈనెల 20న ప్రారంభమైన సర్వే అక్టోబరు 18వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. సర్వేలో బీఎల్‌వోల ద్వారా హెచ్‌టు హెచ్ ధ్రువీకరణ, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, పునఃఏర్పాటు, ఎలక్ట్రల్ రోల్, ఈపీఐసీలోని వ్యత్యాసాలను తొలగించడం జరుగుతుందన్నారు. అక్టోబరు 19 నుంచి 28 వరకు ఫార్మాట్ ఒకటి నుంచి 8 వరకు తయారు చేయడం ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్ తయారు చేయడం జరుగుతుందన్నారు. 29న ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్ట్రోలర్ రోల్ ప్రచురించి ఆ రోజు నుంచి నవంబరు 28వ తేది వరకు క్లైములు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. 2025 జనవరి 6న తుది ప్రచురణ జరుగుతుందని వివరించారు.



బలిజేపల్లిలో ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌వో

తెగిన తుంగభద్ర ఛానల్ గట్లు

● నీట మునిగిన 30 వేల ఎకరాల్లో వరి నారుమళ్లు

● నాటి నేతల నిర్లక్ష్యం.. నేడు రైతు కంట కన్నీరు

చుండూరు, ఆగస్టు 24 : నాటి నేతల నిర్లక్ష్యం నేడు కొందరు రైతులను కన్నీటి పర్యంతం చేస్తుంది. గత ప్రభుత్వం ఐదేళ్ళ పాలనా కాలంలో కోతలకు గురైన కాల్వ గట్లకు మరమ్మతులు చేయకపోవడంతో నేడు రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తుంగభద్ర సైడ్ ఛానల్ (టీఎస్ ఛానల్) పరిధిలో చుండూరు వద్ద కాల్వ గట్లు బలహీనంగా ఉండి శుక్రవారం తెగిపోవడంతో 30 ఎకరాల్లో వరి నారుమళ్ళు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు, కౌలుదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై రైతులు ఇరిగేషన్ అధికారులను నీట మట్టం తగ్గించమని కోరగా, ప్రస్తుతం నీటిమట్టం తగ్గించే అవకాశం లేదన్నారు. ఈ కాలువ చివరి భూముల్లో ఇంకా పూర్తిగా సాగునీరు అందలేదని, ఇంకా వరినారు మళ్ళు కూడా ఆ ప్రాంతంలో పోసుకోలేదని కాల్వ నీటిమట్టం తగ్గిస్తే ఆ ప్రాంత రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని అధికారులు వివరించారు.



కట్టలు తెగిపోవడంతో నీట మునిగిన పంట భూమి

నెంబర్ వన్ కాలువలో అడ్డంకులు తొలగింపునకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేమూరు, ఆగస్టు 24 : 'నీరున్నా సాగు సంకటమే' అంటూ ఈనెల 18న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి నీటి పారుదల శాఖ అధికారులు స్పందించారు. కొల్లిపర మెయిన్ ఛానల్ నుంచి బలిజేపల్లి నెంబర్ వన్ కాలువకు సాగునీరు అందాల్సి ఉండగా ఈ కాలువలో పేరుకున్న తూటికాడ, పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను ముందస్తుగా తొలగించని కారణంగా అబ్బనగూడవల్లి, బలిజేపల్లి, రావికంపాడు, పెనుమర్రు, తాడిగిరిపాడు గ్రామాలకు చెందిన దాదాపు ఆరు వేల ఎకరాల రైతుల భూములకు సాగునీరు అందడం లేదు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళడంతో తక్షణ చర్యలు చేపట్టారు. ఎఈ రవికుమార్ పర్యవేక్షణలో రెండు కిలో మీటర్లకు పైబడి కాలువలో పేరుకున్న వ్యర్థాలను తొలగించడంతో పాటు తూటికాడ, పిచ్చి మొక్కలు నివారణకు కెమికల్ పిచికారి చేసి కూలీల చేత వాటిని తొలగింపజేశారు. దీంతోవెదనాట్లు వేసిన భూములకు సాగునీరు పుష్కలంగా అందుతోంది.



నెంబర్ వన్ కాలువలో అడ్డంకులు తొలగిస్తున్న కూలీలు

ఆడపిల్లలను చదివిద్దాం.. ఆడపిల్లలను రక్షిద్దాం

కొల్లూరు, ఆగస్టు 24 : ఆడ పిల్లలను చదివిద్దాం.. ఆడపిల్లలను రక్షిద్దాం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నగరాజకుమారి నిర్వహించారు. మండల పరిధిలోని జువ్వలపాలెంలో ఆడపిల్లని చదివిద్దాం... ఆడపిల్లను రక్షిద్దాం ప్లకార్డులు ప్రదర్శిస్తూ 100 రోజుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాలికల గురించి వివరిస్తూ 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేసుకోవాలని, బాల్య వివాహాలను తల్లిదండ్రులు ప్రోత్సహించవద్దని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి వివరించారు. సర్పంచ్ కిషోర్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఏఎన్ఎం పద్మ, ఎంఎల్‌హెచ్‌పి రాఘవశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మలాదేవి, జలజ, జ్యోతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

రేపల్లె, ఆగస్టు 24 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సబ్ జైల్లో ఖైదీలకు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షణికావేశానికి లోనుకావటం వలనే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని, మీపై ఆధారపడి జీవించే కుటుంబ సభ్యులు ఎన్నో ఇబ్బందులు పడతారన్నారు. ఇప్పటికైనా మనసు మార్చుకుని నిబద్ధతగా జీవించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలన్నారు. అనంతరం సబ్‌జైల్లో వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు



విద్యుత్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

చినగంజాం, ఆగస్టు 24 : ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో జరుగుతున్న విద్యుత్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో 100 కేవీ విద్యుత్ టాన్స్‌పారం దిమ్మ దెబ్బతిందని, ఆప్రాంతంలోని విద్యుత్ లైన్లు కిందికి వేలాడుతున్నాయని ఇటీవల సోపిరాల గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరికి సమస్యను వివరించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈ పి.గణనారాయణను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ శాఖాధికారులు రూ.3లక్షల నిధులతో శనివారం పనులను ప్రారంభించారు. ట్రాన్స్‌ఫారమ్ దిమ్మె నిర్మాణం, 35 అడుగుల విద్యుత్ స్తంభాలు రెండు, 30 అడుగుల స్తంభాలు రెండు, సపోర్టు స్తంభాలు నాలుగు, కేబుల్ వైరు వినియోగిస్తున్నామని, పనులను రెండు రోజులలో పూర్తి చేస్తామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి



లలితమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, ఆగస్టు 24 : కొరిశపాడు మండలంలోని రావినూతలలో పలు కార్యక్రమాలకు రాష్ట్ర విద్యుత్ మంత్రి రవికుమార్ హాజరయ్యారు. టీడీపీ మహిళ నాయకురాలు చప్పిడి లలితమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లలితమ్మ కుమారుడు చంద్రశేఖర్‌ను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కే కాంతారావు సతిమణి ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కారుసాల నాగేశ్వరరావు, మొవుర్తి లక్ష్మీనారాయణ, యడ్లపల్లి నరసింహరావు, కారుసాల బ్రహ్మానందం, కారుసాల సుబ్బయ్య, కారుసాల గురుబాబు ఉన్నారు.

చమత్కార శబ్దార్థముల గారడీ అవధానం



శతావధానంలో పాల్గొన్న నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పృచ్ఛకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 24 : చమత్కార శబ్దార్థముల గారడీ అవధానం అని ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథ రచయిత, శతావధాన సంచాలకులు పోటూరి వెంకట శివరామ ప్రసాదరావు అన్నారు. సాహితీ మిత్ర మండలి అద్దంకి, పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్‌లో సంపూర్ణ శతావధాన కార్యక్రమం శనివారం లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యంచే 4వ శతావధానం మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. కవితలకు పుట్టినిల్లు కొప్పరపు వారిల్లని, పద్యం పాతబడలేదనడానికి సాక్ష్యం అవధానం అన్నారు. ఈ శతావధానంలో వివిధ జిల్లాల నుంచి 25 మంది పృచ్ఛకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర్‌దత్తు, మురళీసుధాకరరావు, కుకట్ల సుబ్బారావు, డివియం సత్యనారాయణ, డాక్టర్ యు. దేవపాలన, చిన్ని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

29న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

చినగంజాం, ఆగస్టు 24 : ఇంకొల్లు జడ్పీ బాలుర పాఠశాలలో ఈ నెల 29వ తేదీన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగిరెడ్డి స్వామిరెడ్డి, కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16 విభాగాలలో బాలబాలికలకు, 18, 20, 23 విభాగాలలో యువతీయువకులకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పుట్టిన రోజు సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు, పోటీలు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు గోపీచంద్ రెడ్డి 8074992796, 7675026220, పీడీ కే.మధు 9949741392 సెల్ నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

విద్యాశాఖలో పథకాలకు మహనీయుల పేర్లు

ఒంగోలు (విద్య), ఆగస్టు 24: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో అమలవుతున్న వివిధ పథకాల పేర్లను టీడీపీ కూటమి ప్రభుత్వం మార్చింది. గత ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి జగన్ పేరుతో అమలు చేసిన వాటికి మహనీయుల పేర్లు పెట్టింది. వారిని గౌరవించింది. ఈమేరకు ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్య మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిశీలగ్రత విభాగం డైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం ఆరు పథకాల పేర్లను మార్చారు. జగనన్న అమ్మ ఒడికి తల్లికి వందనంగా నామకరణం చేశారు. జగనన్న విద్యాకానుకను సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా మార్చారు. జగనన్న గోరుముద్ద ఇకపై డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా అమలు చేయనున్నారు. మనబడి నాడు-నేడును మనబడి-మనభవిష్యత్‌గా మార్చారు. స్వేచ్ఛ పథకానికి బాలికా సురక్ష పేరు పెట్టారు. జగనన్న ఆణిముత్యాలను అబ్దుల్‌కలాం ప్రతిభా పురస్కారంగా మార్చారు. ఈనెల 22 నుంచి ఈ పథకాలకు కొత్తపేర్లు అమల్లోకి వచ్చాయి

వచ్చేనెల మొదటి వారంలో సాగర్ నీరు విడుదల

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 24 : జిల్లాలో సాగుకు సాగర్ నీటిని వచ్చేనెల మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆయకట్టు ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) కేటాయింపుల ఆధారంగా నీటి పంపిణీ జరుగుతుందన్నారు. సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ఆమె కోరారు. జిల్లాలో అధికారికంగా ఉన్న ఆయకట్టు 2,54,392 ఎకరాలకు ఒక పంటకు సాగునీటిని ఇస్తామన్నారు. అవసరమైతే వారబందీ విధానంలో నీటిని మేజర్లకు సరఫరా చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల పర్యవేక్షణలో నీటిని క్రమపద్ధతిన వినియోగించుకొనేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి అవసరాల కోసం నింపిన చెరువుల్లోని నీటిని అందుకోసం మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ కోరారు.

స్పా సెంటర్‌లో పోలీసుల తనిఖీలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 24: ఒంగోలు నగరంలోని ఓ స్పా సెంటర్‌లో శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేపట్టారు. గతంలోనూ ఇదేవిధంగా ఆకస్మిక దాడులు నిర్వహించగా సదరు స్పాసెంటర్‌లలో మహిళలు పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అక్కడ పనిచేస్తున్న మహిళలను హోంకు పంపించి, స్పాసెంటర్ యజమానితోపాటుగా అక్కడకు వెళ్ళిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈక్రమంలో పోలీసులు మరోమారు తనిఖీలు చేయగా అక్కడ మహిళలు లేరు. దీంతో స్పాసెంటర్ యజమానులకు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, తాలుకా ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

24 శాతమే!

- ఖరీఫ్‌లో పంటల సాగు పరిస్థితి ఇదీ
- వెంటాడుతున్న వర్షాభావం
- సాధారణంలో నాల్గోవంతు కూడా దాటని విస్తీర్ణం
- కీలకమైన కంది, పత్తి సాగుకు మించిపోతున్న సమయం
- ఎండల తీవ్రతతో వేసిన పైర్లు కూడా వాడుముఖం
- ఆందోళనలో రైతులు

నిండు వర్షాకాలం. ఊరూవాడా చిత్తడిగా మారాల్సిన సమయం. పొలంలో వేసిన విత్తనాలు మొలకెత్తి పచ్చదనం పరుచుకోవాల్సిన తరుణం. కానీ జిల్లాలో అందుకు పూర్తిభిన్నమైన పరిస్థితి నెలకొంది. రెండు నెలలుగా వర్షాభావం వెంటాడుతోంది. ఆకాశంలో కమ్ముకుంటున్న కారు మబ్బులు రైతుల్లో ఆశలు రేకెత్తించి అంతలోనే మాయమవుతున్నాయి. అక్కడక్కడా జల్లులు తప్ప జడివాన కరువైంది. దీంతో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో నాల్గోవంతు కూడా సాగుకు నోచుకోలేదు. వేసవిని తలపిస్తూ ఎండలు కాస్తుండటంతో వేసిన పైర్లు కూడా ఎండిపోతున్నాయి. కీలకమైన కంది, పత్తి సాగుకు సమయం మించిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు కొనసాగితే ఈ ఏడాది ఖరీఫ్ సాగు సగం విస్తీర్ణంలో కూడా చేయలేమని వారు వాపోతున్నారు.



పిసిపల్లి మండలంలో సాగుకు నోచుకోకుండా బీడును తలపిస్తున్న భూమి

ఒంగోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ ప్రతికూలంగా సాగుతోంది. సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు గడిచినా సాధారణంలో 24శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ ఖరీఫ్ సీజన్‌గా పరిగణిస్తారు. ఆ సమయంలో సుమారు 2.02 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయి. కంది, పత్తి, మిర్చి ప్రధాన పంటలు. వాటితోపాటు వరి, సజ్జ, జొన్న మొక్కజొన్న, నువ్వు, పెసర, మినుము ఇతరత్రా పలు పైర్లు వేస్తారు.

ఒక్క వరి పూర్తిగా సెప్టెంబర్‌లో, అదే నెలలో మిర్చి కొంత విస్తీర్ణం సాగు చేస్తారు. మిగతావన్నీ వర్షాధార పంటలే. సాధారణంగా ఈ సమయానికి ఆ పంటల సాగు మూడొంతులు పూర్తవుతుంది. ఆ రకంగా ఆగస్టు ఆఖరుకు లక్షన్నర హెక్టారలో పంటలు సాగవుతాయి. అయితే మరో ఐదు రోజుల్లో నెల ముగుస్తున్నా ఇంతవరకూ 50 వేల హెక్టార్లలో కూడా పంటలు సాగుకు నోచుకోలేదు.

48,464 హెక్టార్లలోనే పంటల సాగు

జిల్లాలోని ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2.02 లక్షల హెక్టార్లలో ఇప్పటి వరకూ కేవలం 48,464 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే సాధారణ విస్తీర్ణంలో కేవలం 24 శాతం లోపుగానే విత్తనం పడింది. సకాలంలో వర్షాలు కురవక ఈ పరిస్థితి ఏర్పడింది. వాతావరణం అనుకూలించి సకాలంలో పంటలు సాగైతే ఈ సమయానికి జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో ఏగ్రామం వెళ్లినా పొలాలు పచ్చని పైర్లతో కళకళలాడుతుండేవి. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితి కన్పించడం లేదు. ఎక్కువ భూములు సాగుకు నోచుకోలేదు. వేసిన పైర్లు కూడా వాడుముఖం పట్టాయి.



దర్శి ప్రాంతంలో ఎదుగుదల లేని కందిపైరు

ఆరంభంలో మురిపించి.. ఆతర్వాత సరిపడా కురవని వాన

ఈ ఏడాది తొలుత కాస్తంత అనుకూలంగానే వాతావరణం కనిపించింది. జూన్‌లో సాధారణం కన్నా అధికంగానే వర్షం కురిసింది. దీంతో జిల్యావ్యాప్తంగా రైతులు సాగుకు సిద్ధమయ్యారు. అయితే జూలైలో నెలకొన్న వర్షాభావం పంటల సాగును దెబ్బతీసింది. దుక్కులు దున్ని విత్తేందుకు సిద్ధమైన రైతులు వర్షాలు లేక పంటలు సాగు చేయలేకపోయారు. తొలకరి పైర్లుగా పిలుచుకొనే సజ్జ, జొన్న, నువ్వు, పెసర పశుగ్రాసం సాగుకు జూలైలో నెలకొన్న వర్షాభావం విఘాతం కల్పించింది. ఖరీఫ్‌లో కీలకమైన కంది, పత్తి, మిర్చి ఇతరత్రా వాటిపైనా ఆ ప్రభావం పడింది.

అత్యధిక ఖరీఫ్‌లో విస్తీర్ణంలో కంది, పత్తి సాగు చేస్తారు. ఈ సీజన్‌లో కంది సుమారు 73 వేలు, పత్తి 31 వేలు వెరసి ఈ రెండు పంటలే దాదాపు 1.04లక్షల హెక్టార్లలో సాగు చేస్తారు. ఇప్పటివరకూ రెండు పంటలూ కలిసి కేవలం 26 వేల హెక్టార్లలోపు మాత్రమే సాగు కాగా మరో ప్రధానమైన మిర్చి సాగు కూడా కదలలేదు. ఈ నెలాఖరుతో కంది, పత్తి సాగుకు సమయం మించిపోతుండగా తదుపరి వర్షాలు కురిసినా వరి, మిర్చి, మినుము, ఇతర పంటలు సాగుకు పెద్దగా అవకాశం ఉండదు. ఈ ప్రకారం చూస్తే ఈ ఏడాది ఖరీఫ్ సాగు సగం విస్తీర్ణంలో కూడా జరిగే అవకాలు కనిపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రేపు 'మీకోసం' రద్దు

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 24: ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి వారం నిర్వహించే మీ కోసం (ప్రజా ఫిర్యాదుల దినం)ను సోమవారం రద్దు చేసినట్లు కార్యక్రమ జిల్లా సూపరింటెండెంట్ డి.నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా సెలవు దినం కావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి అర్జీలతో ఎవ్వరూ ఒంగోలు రావద్దని ఆమె కోరారు.

స్కూలు బస్సులపై కొరడా

- రవాణా శాఖ అధికారుల తనిఖీలు
- తొమ్మిది కేసులు నమోదు



బస్సులను తనిఖీచేస్తున్న అధికారులు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24 : నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూలు బస్సులపై రవాణా శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. శనివారం స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో 60 బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని బస్సు డ్రైవర్లు, పన్నులు చెల్లించని బస్సు యాజమానులపై తొమ్మిది కేసులు నమోదు చేసినట్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. నిబంధనల ప్రకారం 60 ఏళ్లు పైబడిన వారు బస్సు నడపకూడదు. అయితే ఓ బస్సు డ్రైవర్‌కు 60 ఏళ్లకుపైన ఉన్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. మరో రెండు బస్సులు క్వార్టర్ ట్యాక్స్ చెల్లించకపోగా, ఒక బస్సుకు అసలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదు. ఇరువురు డ్రైవర్లు లైసెన్సులు లేకుండా, నలుగురు యూనిఫాం ధరించకుండా బస్సు నడుపుతున్నారు. వీరందరిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించి నట్లు ఎంవీఐ తెలిపారు. నిత్యం తనిఖీలు చేస్తామని, నిబంధనలకు విరుద్ధంగా స్కూలు బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

లక్షాధికారిని చేయడమే లక్ష్యం

- నేడు లఖ్‌పతీ దీదీ పథకం ప్రారంభం
- తొలి విడత జిల్లాలో 7,050 మంది పొదుపు మహిళల ఎంపిక
- స్వయం ఉపాధి కోసం రుణాలు
- అన్ని మండలాల్లో ప్రధాని మోదీ సందేశం వినిపించే ఏర్పాట్లు చేసిన అధికారులు



ఒంగోలు నగరం, ఆగస్టు 24 : పొదుపు సంఘాల మహిళల్ని లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లఖ్‌పతీ దీదీ పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తోంది. దీన్ని ప్రధాని మోదీ ఆదివారం మహారాష్ట్రలో ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన మహిళలకు స్వయం ఉపాధి కోసం రుణాలను అందించనున్నారు. ఈ యూనిట్ల నిర్వహణ ద్వారా ఏడాదికి ఒక్కో లబ్ధిదారునికి వార్షికాదాయం లక్ష రూపాయలకు తగ్గకుండా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఈ పథకం కింద యూనిట్లను స్థాపించే వారిని ప్రభుత్వం లక్‌పతీ దీదీలుగా పిలవనుంది. ఒక్కొక్కరికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ రుణం ఇవ్వనుంది. వారు యూనిట్లను స్థాపించుకుని వాటిని విజయవంతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన సహకారం సెర్ప్ నుంచి అందించనుంది. ఈ యూనిట్ల స్థాపన ద్వారా నెలకు రూ.10 వేలు తగ్గకుండా ఏడాదికి రూ. లక్షకుపైగా ఆదాయం లభించే దిశగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది. జిల్లాలో వెలుగు, పేదరికి నిర్మూలన సంస్థ అధికారులు 1.18 లక్షల మంది మహిళల్ని ఇప్పటి వరకు లక్‌పతీ దీదీలుగా గుర్తించారు. వీరిలో 7,050 మందికి ఈ ఏడాది రుణాలు అందజేసి యూనిట్లను స్థాపించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ఈ పథకాన్ని ఆదివారం ప్రధాని మహారాష్ట్రలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఒంగోలుతోపాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పొదుపు సంఘాల మహిళలు తిలకించేలా ఏర్పాట్లు చేశారు. తొలి విడతగా ఈ పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన 7,050 మందికి అధికారులు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సంబంధిత సర్టిఫికెట్లను అందజేయనున్నారు.

ఒంగోలు గనుల శాఖ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- ఐదేళ్లలో ఇసుక అక్రమాలపై ఆరా
- రికార్డులు క్షుణ్ణంగా పరిశీలన

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24: ఒంగోలులోని భూగర్భ, గనుల శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. గత ఐదేళ్లలో జరిగిన ఇసుక అక్రమాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఇసుకు తవ్వకాలకు ఇచ్చిన అనుమతుల గురించి విచారించినట్లు తెలిసింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ ఇసుక టెండర్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో ఒంగోలులో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ సోదాలు కొనసాగాయి. పూర్తిగా కార్యాలయం గేట్లు మూసివేసి సిబ్బందిని మాత్రమే లోపలికి అనుమతించారు. రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రకాశం జిల్లాలో ఇసుక తవ్వకాల లీజును వైసీపీ హయాంలో జేపీ పవర్ వెంచర్స్‌కు ఇచ్చారు. అయితే జేపీ పవర్ వెంచర్స్ అప్పట్లో అడ్డగోలుగా తవ్వకాలు, అక్రమ రవాణా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఏసీబీ అధికారులు సమగ్రంగా విచారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి ఎంత చెల్లించారు? అసలు బిల్లులు లేకుండా ఇసుక అక్రమ రవాణా ఎలా జరిగింది? అన్న విషయాలపై లోతుగా ఆరా తీసినట్లు సమాచారం. ఇసుక రీచ్‌లు లేకుండానే ఎక్కడైనా అనుమతులు ఇచ్చారా? అన్న అంశాన్ని కూడా పరిశీలించినట్లు సమాచారం.

ఇసుక తవ్వకాలకు సంబంధించి జేపీ పవర్ వెంచర్స్ ప్రభుత్వానికి రూ.13 కోట్లు చెల్లించాలని గనుల శాఖ గతంలో నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. కానీ ఆమొత్తాన్ని ఇప్పటి వరకూ చెల్లించలేదని సమాచారం. అందుకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఏసీబీ అధికారులు సేకరించినట్లు తెలిసింది. తనిఖీలలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ డీపీతో మస్కా!

- చాటింగ్‌తో చీటింగ్ చేసేందుకు యత్నం
- అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తి
- వెంటనే సదరు నంబర్ బ్లాక్
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ దామోదర్ సూచన

ఒంగోలు (క్రైం), ఆగస్టు 24: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారుల ఫొటోలు డిస్‌ప్లే పిక్చర్ (డీపీ)గా పెట్టుకొని అనేక మోసాలకు పాల్పడుతున్నారు. ఏకంగా ప్రకాశం ఎస్పీ దామోదర్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకొని ఆయనకు తెలిసిన వ్యక్తి నుంచి నగదు గుంజేందుకు ప్రయత్నించిన ఉదంతం శనివారం వెలుగు చూసింది. దీన్ని గమనించిన సదరు వ్యక్తి ఎస్పీకి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వెంటనే మోసగాడి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేయించారు. తదుపరి చర్యలకు ఆదేశించారు. ఆ మోసగాడు... ఎస్పీ ఫేస్‌బుక్ ఫ్రెండ్‌కు తొలుత 'హలో... హవ్ ఆర్ యూ... వేర్ ఆర్ యూ యట్ ది మూమెంట్' అని మెసేజ్ పంపాడు. అనంతరం మిస్‌డ్ వాయిస్ కాల్ చేశారు. ఆతర్వాత కొద్దిసేపటికి చాలా అత్యవసరం, ఆపదలో ఉన్నామంటూ మెసేజ్ చేసి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నగదు పంపాలని కోరాడు. అయితే ఆ విషయాన్ని ఎస్పీకి ఆయన ఫేస్‌బుక్ ఫ్రెండ్ ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఎస్పీ దామోదర్ అప్రమత్తమై వెంటనే అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రముఖుల ఫొటోలు డీపీలుగా పెట్టుకొని కొందరు మాయగాళ్లు మోసం చేస్తున్నారన్నారు. ఎవరైనా అత్యవసరమని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డబ్బులు పంపాలని తొందరపెడితే నమ్మవద్దన్నారు. అనుమానంగా ఉంటే వెంటనే నంబర్‌ను బ్లాక్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

సోలార్‌తో నాణ్యమైన విద్యుత్

ముండ్లమూరు, ఆగస్టు 24: సోలార్‌తో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఎంతో ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. వాతావరణంలో కూడా కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. ముండ్లమూరు మండలంలోని గంగన్నపాలెం వద్ద 14 ఎకరాల్లో రూ.15 కోట్ల వ్య యంతో ఏర్పాటుచేసిన సోలార్ పవర్‌ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వినూత్న పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తికి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు శ్రీకారం చుట్టారని చెప్పారు. అందులో భాగంగా హైడ్రోజన్, విండ్ పీఎస్పీ మరికొన్ని పద్ధతుల్లో ఉత్పత్తికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగుకు పనికిరాని భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. అం దుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని చెప్పారు.

గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసిందని మంత్రి రవికుమార్ ధ్వజమెత్తారు. సోలార్ ద్వారా ఒక్క యూనిట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలే దన్నారు. జల, థర్మల్ విద్యుత్తులు అధిక వ్యయంతో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ప్రక్క రాష్ట్రాల కంటే తమ బినామీ సంస్థల ద్వారా విద్యుత్‌ను కొనుగోలు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 56 రోజుల్లోనే 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసిందన్నారు. అందులోభాగంగా ఇప్పటికే స్తంభాలు, ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. విద్యుత్ వైరు కొర తతో కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. వారం రోజుల్లోనే కండక్ట ర్లు వచ్చిన వెంటనే కనెక్షన్లు అందజేస్తామన్నారు.

గ్రామీణ ప్రాంతమైన మారెళ్లలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేసిన సినీ నిర్మాత అశోక్‌బాబును గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, డాక్టర్ లలిత్‌సాగర్, ప్లాంట్ నిర్వాహకులు అశోక్‌కుమార్, ఎస్ఈ సత్యనారాయణ, సీఈవో ఉన్నం నవీన్, సీవోవో ఆర్తీక, బాతు కరీమ్, ఏడీ పిచ్చయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో ఆర్.జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటి బండారు పద్మావతి మృతి

అద్దంకి, ఆగస్టు 24 : ప్రముఖ రంగస్థల నటుడు బండారు రామారావు కుమార్తె రంగస్థల నటి, టీవీ ఆర్టిస్ట్, రేడియో ఆర్టిస్ట్ బండారు పద్మావతి శనివారం నెల్లూరులో మృతి చెందారు. అద్దంకికి చెందిన పద్మావతి నెల్లూరులో స్థిర పడ్డారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ పద్మావతి పలు పౌరాణిక పాత్రలతో జనాదరణ పొందారు. పద్మావతి మృతి పట్ల అద్దంకి నియోజకవర్గ కళాకారుల సంఘం ప్రతినిధులు సంతాపం తెలిపారు.



అన్న క్యాంటీన్‌కు విరాళం

అద్దంకి, ఆగస్టు 24: అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు ముందుకు వచ్చి విరాళాలను అందించడం అభినందనీయమని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కొటికలపూడిలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి మంత్రి రవికుమార్ హాజరుకాగా, తిమ్మారెడ్డిపాలెంకు చెందిన గాలి నారాయణ రూ.10వేల చెక్కును అన్న క్యాంటీన్‌కు విరాళంగా ప్రకటిస్తూ మంత్రి రవికుమార్‌కు అందజేశారు.



మంత్రికి చెక్కును అందజేస్తున్న నారాయణ

అడిగేవారు..అడ్డుకునేవారెవరు?

- ఆ ధీమాతోనే ఓ వ్యక్తి ఇష్టారాజ్యం
- సాగర్ కాలువకట్ట, పొలాల అంచున యథేచ్ఛగా గ్రానైట్ వ్యర్థాల డంపింగ్
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న గ్రామస్థులు



సాగర్ కాలువ కట్టపై గ్రానైట్ వ్యర్థాల కుప్పలు

మార్టూరు, ఆగస్టు 24 : చెరువు గట్లు, పొలాల అంచుల వద్ద గ్రానైట్ వర్థాలను రాత్రికిరాత్రే డంప్ చేయడంలో అతడో రింగ్ మాస్టర్. మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన అతనిపేరు అందరికీ తెలియకపోవచ్చుగానీ లడ్డోడు అంటే తెలియనవారుండరు. అతడికి రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ ఉన్నాయి. వాటి సాయంతో జొన్నతాళి, మార్టూరు గ్రామాలకు చెందిన కొన్ని గ్రానైట్ పరిశ్రమలకు చెందిన వ్యర్థాలు, పనికిరాని రాళ్లు, గ్రానైట్ బూడిదను టిప్పర్లలో రాత్రికి రాత్రికి తరలించి ఖాళీగా కన్పించే పొలాలు, చెరువు గట్ల అంచుల్లో పడేస్తున్నారు. ఈ దందా కోసం గ్రానైట్ ఫ్యాక్టరీల యాజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తారు. వ్యర్థాలను దూరప్రాంతాలకు తరలించి డంపింగ్ చేయడం ఎందుకులే అనుకున్నాడో ఏమో గానీ తన సొంత గ్రామంపై మమకారంతో, ఎవరూ తనను అడ్డుకోరన్న ధీమాతో గ్రామంలోని చెరువు గట్లు, పొలాలు అంచుల్లో వ్యర్థాలను ఇష్టానురీతిన పడేస్తున్నారు. ఇటీవల జాతీయరహదారిపై గ్రామ బ్రిడ్జికి సమీపంలో బొల్లాపల్లి సాగర్ కాలువ వద్ద, కాలువ కట్టపై భారీగా వ్యర్థాలను తరలించారు. కొంతకాలంగా ఈ దందా సాగుతున్నా రెవెన్యూ, పంచాయతీ, సాగర్ కాలువ అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయమై గత నెల 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో సాగర్ కాలువైతే మాకేంటి.. శీర్షికన కథనం ప్రచురితమైంది. కాని కొనంకి ఎన్ఎస్‌పీ అధికారులు ఇంతవరకు స్పందించలేదు. దాంతో గ్రామంలోని వ్యక్తి మరింత ఉధృతంగా గ్రానైట్ వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. అంతేగాకుండా సమీపంలోని గ్రావెల్ కొండ నుంచి అక్రమంగా అడపాదడపా గ్రావెల్‌ను తవ్వి అమ్మకాలు చేస్తుంటాడు. గ్రానైట్ వ్యర్థాలను డంపింగ్ చేయడం, చేసుకోవడంలో తప్పులేదుగానీ ఇలా గ్రామంలోని ఖాళీ ప్రదేశాలలో, చివరకు సాగర్ కాలువ గట్లపై వేస్తుండడంతో మున్ముందు జరిగే నష్టం భారీగానే ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో అధికారులు పట్టించుకోలేదు. చంద్రబాబు ప్రభుత్వమైనా వెంటనే పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శనివారం కొంతమంది గ్రామస్థులు ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకొచ్చారు.

గ్రానైట్ వ్యర్థాలను ఇక్కడ వేయొద్దని చెప్పాం

గ్రామంలో గ్రానైట్ వ్యర్థాలను కొన్నింటిని తొలగించాం. ఆ ప్రాంతాల్లో వ్యర్థాలు వేస్తే కేసు పెడతామని సదరు వ్యక్తికి హెచ్చరించాం. సిబ్బంది కొరత కారణంగా పూర్తిగా చర్యలు తీసుకోలేకపోతున్నాం.

\- హరిబాబు, పంచాయతీ కార్యదర్శి, బొల్లాపల్లి



బొల్లాపల్లి గ్రామంలో చెరువు కట్టపై పడవేసిన గ్రానైట్ వ్యర్థాలు



విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న శివనాగేశ్వరావు

సేవా కార్యక్రమాలే లక్ష్యం

టీడీపీ సీనియర్ నేత శివనాగేశ్వరరావు

పర్చూరు, ఆగస్టు 24 : ప్రజాసేవే లక్ష్యంగా కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఏర్పాటు చేసినట్లు టీడీపీ సీనియర్ నాయకులు కొండ్రగుంటి శివనాగేశ్వరరావు అన్నారు. శనివారం పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం గ్రామంలోని బధిరుల పాఠశాలలోని గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. భవిష్యత్‌లో ఫెడరేషన్ ద్వారా నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి సాయం అందించే విధంగా కార్యాచరణ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు కొల్లా రాజేశ్వరరావు (రాజా), రొటేరియన్ గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాది సురేష్, కొల్లా చౌదరి, కోట శ్రీనివాసరావు, కోట వీరప్రసాద్, కొల్లా సుబ్బారావు, నార్నే చంద్రశేఖర్, బత్తుల సాంబశివరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి కోలలపూడి విద్యార్థి

మార్టూరు, ఆగస్టు 24 : మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పూరిమెట్ల సంజయ్ మూడవ లిస్టులో ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. ఒంగోలు క్యాంపస్‌లో సీటు లభించింది. తమ పాఠశాలల్లో ముగ్గురు సీట్లు లభించాయని విద్యా కమిటీ ఛైర్మన్ తాతా నాగేశ్వరరావు తెలిపారు.

ఆ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలి

ఎమ్మెల్యే ఏలూరికి వినతి

పర్చూరు, అగస్టు 24: గత వైసీపీ పాలనలో నిధులు మంజూరు చేయక అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు భరోసా, గ్రామీణ హెల్త్ సెంటర్ భవనాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని శనివారం మండలం అడుసుమల్లి గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడ్డగడ్డ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే ఏలూరికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న విద్యార్థులు

పర్చూరు, అక్టోబరు 24 : పర్చూరులోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చాటిచెప్పేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు శ్రీకృష్ణుడు, రాధా, గోపిక వేషధారణతో వేసిన నృత్య ప్రదర్శన మంత్రముగ్దులను చేసింది. అనంతరం ఉట్టికొట్టించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోరంట్ల సుబ్బారావు, డైరెక్టర్ లక్ష్మయ్య చౌదరి, ప్రిన్సిపాల్ షాఫియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

మార్టూరు, ఆగస్టు 24 : జొన్నతాళి సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్న పసుమర్తి దానియేలు అనే వృద్ధుడిని కారు ఢీకొట్టిన ఘటన శనివారం జరిగింది. ఈ ప్రమాదంలో దానియేలు రోడ్డు పక్కన డివైడర్ పైకి ఎగిరి పడిపోయారు. దాంతో అతని కాలికు గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇసుకదర్శి గ్రామానికి చెందిన దానియేలు జొన్నతాళి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా చిత్తూరు జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారి కారు విజయవాడ వెళ్తుండగా ఢీకొట్టింది. దానియేలును ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒంటరి మహిళ ఇంట్లో చోరీ

అదుపులో నిందితుడు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 24 : దత్తక్షేత్రం సమీపంలో నాగమణి అనే ఒంటరి మహిళ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి ఒంగోలు రిమ్స్‌లో పనిచేస్తుంది. ఎప్పటి మాదిరిగా ఆమె డ్యూటీకి వెళ్లింది. శుక్రవారం తిరిగి ఇంటికి వచ్చే సమయానికి ఇంటి తాళం కోసి తీసి ఉంది. ఇంట్లో బీరువాలో ఉన్న రెండున్నర సవర్ల బంగారు ఆభరణాలు, రూ.48వేల నగదుతో పాటు టీవీ చోరీ అయినట్లు బాధితురాలు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

ఐదుగురు జూదరుల అరెస్ట్

చినగంజాం, ఆగస్టు 24 : మండలంలోని మున్నంవారిపాలెంలోని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో పేకాట శిబిరంపై శనివారం దాడి చేసి ఐదుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్.ఐ శీలం రమేష్ తెలిపారు. పేక ఆడుతున్న 5గురుని అరెస్ట్ చేసి వారి వద్ద గల రూ.1100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులు ప్రారంభం

పంగులూరు, ఆగస్టు 24 : పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో శనివారం డిజిటల్ తరగతులను ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఖోఖో అంతర్జాతీయ క్రీడాకారుడు తపాల శాఖ ఏఏవో పోతిరెడ్డి శివారెడ్డి కళాశాలలో డిజిటల్ తరగతుల నిర్వహణకు అవసరమైన ప్రొజెక్టర్, వాల్ స్క్రీన్, ట్రాలీ స్పీకర్ కొనుగోలుకు రూ.50వేల నిధులు సమకూర్చారు. డిజిటల్ బోధన సులభ తరంగా ఉంటుందని, కళాశాలలో విద్యార్థులకు అకడమిక్, క్రీడా సం బంధమైన విషయాలు స్క్రీన్‌పై చూసి తెలుసుకునే అవకాశం ఉంటుందని ప్రిన్స్‌పాల్ ఉషారాణి తెలిపారు. దాత శివారెడ్డికి ప్రిన్స్‌పాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాయిణి ప్రమీల, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రమేష్, రోటరీ ప్రతినిధి వీరరాఘవయ్య, పీడీ సీతారామిరెడ్డి, గుడిపూడి రామారావు పాల్గొన్నారు.

దేవిశ్రీకి ఏలూరి అభినందనలు

పర్చూరు, అగస్టు 24 : మార్టూరు మండలం ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంప్ కార్యాలయంలో శనివారం గిన్నిస్ బుక్ అవార్డు అందుకున్న ఆదిపూడి దేవిశ్రీని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేకంగా అభినందించారు. గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకునేందుకు విద్యార్థి చేసిన కృషిని ఈసందర్భంగా ఏలూరి కొనియాడారు. నిబద్ధత, అంకిత భావంతో కృషి చేస్తే ఫలితాలు వస్తాయన్నారు. కారంచేడు మండలం యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన దేవిశ్రీ కాఫీ పొడిని నీటితో ఉపయోగించుకొని వాటర్ పెయింట్ ద్వారా 150 అడుగుల గాంధీ మహాత్ముని రూపాన్ని చిత్రీకరించి గిన్నిస్ బుక్ రికార్డును కైవసం చేసుకుంది. ఈసందర్భంగా పలువురు దేవిశ్రీని అభినందించారు.



దేవిశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి



అమ్మవారి పూజల్లో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

ఘనంగా అంకమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవం

మంత్రి గొట్టిపాటి పూజలు

పంగులూరు, ఆగస్టు 24 : మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఉదయగిరి వారి వంశ దేవర చిన అంకమ్మతల్లి అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయగిరి వంశస్తులు నూతనంగా నిర్మించిన ఆలయంలో చిన అంకమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయానికి గ్రామానికి చెందిన పూనాటి రామాంజనేయులు 15 సెంట్ల స్థలాన్ని సమకూర్చగా, మంత్రి గొట్టిపాటి సహకారం అందించారు. మంత్రి గొట్టిపాటికి నిర్వాహకులు ఉదయగిరి వెంకటేశ్వర్లు, రామయ్య, ఆజనేయులు సారథ్యంలో స్థానికులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాదెండ్ల నరసింహారావు, ఎనికపాటి శ్రీనివాసరావు, గొల్లపూడి అంజయ్య, పెండ్యాల సుబ్బారావుతో పాటు టీడీపీ మండల నాయకులు కేవీ సుబ్బారావు, రావూరి రమేష్, ఏడుకొండలు, చింతల సహదేవుడు, మస్తాన్‌వలి, ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, జగన్, స్వామి, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, శేషగిరి, రవిబాబు, కాజా, జేకేసీ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఎనికపాటి శింగయ్య ఇంట జరిగిన వివాహ వేడుకలో పాల్గొని వరుడు వాసును ఆశీర్వదించారు.

సాగు పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డీఆర్‌సీ డీడీఏ విజయనిర్మల

చినగంజాం, ఆగస్టు 24 : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతులను పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డీఆర్‌సీ డీడీఏ విజయనిర్మల అన్నారు. వ్యవసాయ కార్యాలయ వద్ద బాపట్ల ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు ఆధారిత కార్యకలాపాలుపై శనివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరి పంటలో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని విజయనిర్మల సూచించారు. రైతులు నేల ఆరోగ్యం కాపాడాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని అన్నారు. రైతులకు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అవలంబించాల్సిన సాగు పద్ధతులు, ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆడిషనల్ డీపీఎం. జె.మోహన్, ఏవో భాస్కరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మి, వీపీఏలు, ఎంపీఈడీఎస్, జడ్పీఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

ఇంద్ర బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య



ఇంద్ర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 24 : ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. ఆర్టీసీ డిపోలో నూతనంగా చీరాల, హైదరాబాద్‌కు ఏర్పాటు చేసిన రెండు ఇంద్ర బస్సులను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బస్సులో తొలి టికెట్ కొనుగోలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పింది చేస్తుందన్నారు. అందులో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణానికి సంబంధించిన హామీని త్వరలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా మహిళలు ఆ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బస్ డిపో మేనేజరు శ్యామల, బస్సు డ్రైవరు, కండక్టరు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా



పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, ఆగస్టు 24 : తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మండలంలోని తిమ్మాయపాలెం వద్ద ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురై ఉంది. సమస్యను మంత్రి రవికుమార్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈఈ, డీఈఈ సత్యనారాయణ శనివారం పరిశీలించారు. వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈఈ మస్తాన్‌రావు రైతులకు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్

చీరాల, ఆగస్టు 24 : రక్తదానం మరొకరికి ప్రాణ దానంతో సమానమని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జగదీష్ అన్నారు. శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో చీరా ల ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ రాజా సెల్వన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.జ్యోతి స్వరూప్, ఎన్ఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

అద్దంకిటౌన్, ఆగస్టు 24: కోల్‌కతా హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించి, మహిళలకు రక్షణ కల్పించాలని ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు కావూరి రఘుచంద్ అన్నారు. శనివారం అద్దంకి పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక నాయకులు డాక్టర్ వై. హనుమంతరావు, ప్రజా సంఘాల నాయకులు మన్నం త్రిమూర్తులు, లెక్చరర్ పద్మావతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల కార్యదర్శి తిరుపతిరెడ్డి, గంగాధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంకొల్లు, ఆగస్టు 24 : కోల్‌కతా ఘటనపై నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ ఇంతియాజ్, మండల పార్టీ అధ్యక్షులు నారిశెట్టి ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, ముస్తాఫా అంబేడ్కర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు, పాల్గొన్న ఎంపీపీ జ్యోతి, ఎంపీడీవో దేవ సేన కుమారి

అద్దంకిటౌన్, ఆగస్టు 24: ప్రభుత్వం సూచించే విధి విధాలకు అనుగుణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారం అందించుకోవాలని ఎంపీడీవో ఆర్.దేవసేనకుమారి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయాశాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో గ్రామా ల్లో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయని వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విద్యుత్ శాఖ అధికారిని చక్రాయపాలెం సర్పంచ్ గోగులమూడి నగేష్, కుంకుపాడు సర్పంచ్ గాలం శ్రీనివాసరావులు ప్రశ్నించారు. మండలంలోని 76 ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గతం కంటే పెరిగిందని ఎంఈవో సుధాకరావు తెలిపారు. మహిళలకు వెలుగు పథకం ద్వారా రాయితీపై అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని, మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో హాజరు కావల్సిన ప్రజా ప్రతినిధులకు బదులు పలువురు షాడోలు తిరుగుతుండడం విశేషం. వచ్చిన ప్రజా ప్రతినిధుల్లోని కొందరు సంతకాలు పెట్టామా వెళ్లామా.. అనేవిధంగా సమావేశం నుంచి జారుకున్నారు. వీరి పద్ధతిని పరిశీలిస్తే ఎన్నుకున్న గ్రామ ప్రజల సమస్యలపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. సమావేశంలోనే హెల్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రచారం, అవగాహన కార్యక్రమం నిర్వాహించారు. ఈ అవగాహన కార్యక్రమాలు అన్ని ప్రాంతాలల్లో రెండు నెలల పాటు జరుగుతాయని సంస్థ ప్రతినిధి బీవీ సాగర్ తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

ఇంకొల్లు, ఆగస్టు 24 : ఇంకొల్లులోని గంగవరం రోడ్డులోని చెరువుకట్ట సమీపంలోని బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన శనివారం వెలుగుచూసింది. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన చలిచం పద్మావతి కుటుంబం కొంత కాలంగా ఇంకొల్లులో నివాసముంటున్నారు. భర్త అనారోగ్యంతో బాధపడంతో పాటు మానసిక వత్తిడితో పద్మావతి మతిస్థిమితం లేక శుక్రవారం బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు .శనివారం బావిలో శవం కన్పించడంతో దీనిపై ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జవాబుదారీగా పనిచేయాలి



మాట్లాడుతున్న వెంకటేష్

చీరాల, ఆగస్టు 24 : ప్రతి ఒక్కరూ జావాబుదారీతనంతో పనిచేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేస్ పార్టీ ప్రజా ప్రతనిధులు, నాయకులకు సూచిం చారు. మున్సిపల్ ఛైర్మన్ చాంబర్‌లో శనివారం ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలతో వెంకటేష్ సమావేశం అయ్యారు. జరుగుతున్న, జరగాల్సిన పరిణామాలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి దిశానిర్దేశం చేశారు.